
www.prajapaksham.in
ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
బుధవారం | 16 | ఏప్రిల్ | 2025
పేజీలు 8

## ప్రభుత్వ పథకాలు అర్హులకు అందేలా కార్యాచరణ



3 లో

# భూ సమస్యకు భూ భారతి పరిష్కారం చూపేనా..?




**-చిందరవందరగా భూ రికార్డులు**
**-అక్రమార్కులకు అడ్డుకట్ట పడేనా..?**
**-భూ సర్వేనే పరిష్కారమా..?**

**భూ సమస్య ప్రధాన ఎజెండాగా మారింది. సాగుకు, నివాసానికి మాత్రమే పరిమితం అనుకున్న భూమి ఇప్పుడు వ్యాపార వస్తువు అయింది.** పెరిగిన క్రయ, విక్రయాలతో పాటే భూమి స్టేటస్ సింబల్‌గా మారింది. డిమాండ్ ఉన్న దానిని తమ వద్ద ఉంచుకోవాలన్న వ్యాపార లక్షణం కారణంగానే భూమికి సంబంధించి విస్తృత చర్చ మొదలైంది. ప్రధాన రాజకీయం భూమి చుట్టూ తిరుగుతుండటంతో రాజకీయ ప్రచారస్త్రంగా మారింది. ఈ క్రమంలోనే గత ప్రభుత్వం తెచ్చిన ధరణి అతి కొద్ది మందిని మినహాయిస్తే మిగిలిన వారికి కష్టాలను, నష్టాలను తెచ్చిపెట్టింది. ఇప్పటి ప్రభుత్వం తీసుకొచ్చిన భూ భారతి సమస్యకు పరిష్కారం చూపేనా అన్నదే అందరి మదిని తొలుస్తున్న ప్రశ్న.

-ప్రజాపక్షం/ఖమ్మం

### భూ భారతి - కొత్త ఆర్.ఓ.ఆర్ చట్టం



2 లో

# యథేచ్ఛగా వడ్డీ వ్యాపారం..!



**-అమాయకులకు అధిక వడ్డీలకు గిరిగిరి**
**-రోడ్డున పడుతున్న కుటుంబాలు**
**-దృష్టి సారించని సంబధిత అధికారులు**

ప్రజాపక్షం/కరకగూడెం: కరకగూడెం ఏజెన్సీ ప్రాంతంలో గిరి గిరీల దందా రోజురోజుకు అడ్డూ అదుపు లేకుండాపోతోంది. అవసరాలను ఆసరాగా చేసుకొని ఇష్టానుసారం వడ్డీ వసూలు చేస్తూ పేద, మధ్య తరగతి ప్రజల రక్తం తాగుతున్నారు. అసలను మించి వడ్డీ చెల్లించినా.. ఇంకా మిగిలే ఉందంటూ దాడులకు తెగబడుతున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, కరకగూడెంలో వడ్డీ (గిరి) వ్యాపారులు పేదలను దోపిడీ చేస్తున్నారు. ఏజెన్సీ ప్రాంతంలో గిరిజన చట్టాలను తుంగలో తొక్కి ఎటువంటి రిజిస్ట్రేషన్లు లేకుండా, పేద, మధ్య తరగతిప్రజలు, అమాయకుల అవసరాలను ఆసరాగా చేసుకుని చారాణ ఇచ్చి భారాణ వడ్డీతో కోట్లు సంపాదిస్తున్నారు. ప్రైవేట్ వ్యక్తులు మణుగూరు, పినపాక, బయ్యారం, తాడువాయి నుండి వచ్చి వడ్డీ వ్యాపారుల చేతికి చిక్కి పేదలతోపాటు సామాన్యులు, వివిధ రకాల వ్యాపారస్తులు, ఆటో, మ్యాజిక్ డ్రైవర్లు,

మిగతా 2లో..

# రైతు పేరుతో ఘరానా మోసం



**-నాలుగు నెలలుగా రోజుకు లక్షల్లో వ్యాపారం**
**-ఇసుక దందా కేంద్రంగా పాలేరు, నాయకన్‌గూడెం**
**-అడ్డుకోని మండల అధికారులు**

ప్రజాపక్షం/కూసుమంచి : మండలంలోని నాయకన్‌గూడెం గ్రామానికి చెందిన ఓ రైతు పేరుతో ప్రతిరోజు లక్షల్లో అక్రమ ఇసుక వ్యాపారం జోరుగా నడుస్తుంది. వివరాల్లోకి వస్తే గత సంవత్సరం 2024 ఆగస్టులో వచ్చిన వరదలకు పాలేరు చెరువు కింది పొలాల్లో నుండి వరద ప్రవాహం వలన కొందరి రైతుల పొలాలు ఇసుకమేట వేయడం జరిగింది. దీనిపై ఖమ్మం జిల్లా కలెక్టర్ అనుమతితో ఇసుకమేట కోసిన పొలాలను లెవెల్ చేసుకుంటామని చెప్పి ఇసుకను కొందరు రైతులు ఎత్తి పోసుకోవడం పూర్తి చేశారు. కానీ నాయకన్‌గూడెం గ్రామానికి

మిగతా 2లో..

# భూ సమస్యకు 'భూ భారతి' పరిష్కారం చూపేనా..?

**ప్రజాపక్షం/ఖమ్మం :** భూ సమస్యకు పరిష్కారం చూపేందుకు రాష్ట్ర ప్రభుత్వం 'భూ భారతి' చట్టాన్ని తీసుకు వచ్చింది. ఏప్రిల్ 14 నుంచి నాలుగు మండలాల్లో ప్రయోగాత్మకంగా అమలు చేస్తామని జూన్ రెండు నుంచి పూర్తి స్థాయిలో అమలు చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. అసలు భూ సమస్యతో పాటు ధరణి చట్టం కొత్త సమస్యలు తెచ్చిపెట్టింది. ప్రస్తుత భూ రికార్డుల ప్రకారం భూ వివరాలు అస్తవ్యస్థంగా ఉన్నాయి. సర్వే నెంబర్ల వారీగా ఉన్న భూ విస్తీర్ణానికి వాస్తవ విస్తీర్ణానికి చాలా తేడా ఉంది.తక్కువ ఉన్న చోట భూమి కోసం ఘర్షణలు జరుగుతుండగా ఎక్కువ ఉన్న చోట అక్రమార్కులు, బలం ఉన్నవాళ్లు, అధికారులు రాజకీయ అండతో అప్పనంగా అనుభవిస్తున్నారు. సర్వే నెంబర్లు తప్పుల తడక. రెండు దశాబ్దాలుగా రెవెన్యూ అధికారులు బై నెంబర్లతో సర్వే నెంబర్ వ్యవస్థను సైతం నిర్వీర్యం చేశారు. ఖమ్మంజిల్లా కొణిజర్ల మండలం గుబ్బగుర్తి గ్రామ రెవెన్యూ మొత్తం సర్వే నెంబర్లకు రైతులు సాగు చేసుకుంటున్న భూమికి సంబంధం లేదు. ఎవరు ఏ సర్వే నెంబరులో ఉన్నారో, ఎక్కడి భూమి సాగు చేసుకుంటున్నారో సర్వే, రెవెన్యూ అధికారులకు అంతు చిక్కడం లేదు ఇది ఒక ఉదాహరణ మాత్రమే. పట్టాదారు పాసుపుస్తకం ఉన్న భూమి లేని రైతులు భూమి తమ స్వాధీనంలో ఉన్న పాసుపుస్తకం లేని రైతులు లక్షల సంఖ్యలో ఉన్నారంటే అతిశయోక్తి కాదు. వీటన్నింటికి భూ భారతి పరిష్కారం చూపాలి. ధరణి చట్టం వచ్చిన తర్వాత కల్లూరు మండలం పెద్దకోరుకొండి గ్రామంలో ఉన్న రెవెన్యూ భూమి కంటే పాసు పుస్తకాల ప్రకారం హక్కు పొందిన భూమి 400 ఎకరాల పైచిలుకు ఎక్కువగా ఉంది. దీనికి గడిచిన పదేళ్లలో పరిష్కారం దొరక లేదు. అదనపు భూమిని పొందిన వారు బ్యాంకు రుణాలతో పాటు రైతు భరోసా అనుభవిస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది ఎకరాల భూములు భూ రికార్డుల్లోకి ఎక్కలేదు. అసైన్డ్ భూములు, బంచరాయి, ఇనామ్, మన్యాలను దశాబ్దాలుగా సాగు చేసుకుంటున్న రైతులకు భూమిపై హక్కు కల్పించబడలేదు. ధరణికి ముందు పహాణీలలో అనుభవదారు కాలంలో కొనసాగిన లక్షలాది మంది రైతులు ధరణి తర్వాత భూ హక్కును కోల్పోయారు. కేవలం హక్కు లేని సాగు రైతులుగా మిగిలిపోయారు. ఖమ్మం జిల్లా బోనకల్ మండలం రాపల్లి రెవెన్యూలో 140, 414 సర్వే నెంబర్లలో 100 ఎకరాలు పైబడి బంచరాయి భూమి ఉంది. 1970 దశకంలో అప్పటి ప్రభుత్వం భూమిని పేదలకు పంచి సామూహిక పట్టాలు ఇచ్చింది. అప్పటి నుంచి సాగు చేసుకుంటున్న రైతులకు ఎటువంటి భూ హక్కులు లేవు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఇటువంటి భూములపై వాస్తవ అనుభవదారులకు హక్కు కల్పించాల్సి ఉంది. ఈ సమస్యను భూ భారతి లో చేర్చాల్సి ఉంది. గతంలో రోడ్లు, పంట కాలువలు , ఇతర ప్రజా ఉపయోగ పనుల కోసం ప్రభుత్వం భూమిని సేకరించి సంబంధిత రైతులకు పరిహారం అందించింది. ప్రభుత్వం సేకరించిన భూమి పోను మిగిలిన భూమి రైతుల స్వాధీనంలో ఉండగా అట్టి భూమి ధరణి తర్వాత రికార్డుల్లోకి ఎక్కించలేదు. ఒక్క ఖమ్మంజిల్లా చింతకాని మండలంలోనే ఇటువంటి భూ సమస్య వేల ఎకరాల్లో ఉంది. కలెక్టరేట్ పరిధిలోనే భూ సమస్యకు పరిష్కారం ఉండడంతో ప్రతి కలెక్టరేట్‌లోనూ వేల సంఖ్యలోనూ దరఖాస్తులు నెలల తరబడి అపరిష్కృతంగా ఉన్నాయి. భూ చట్టాలలోని లోపాలు కొందరికి వరంగా మారాయి. రెవెన్యూ అధికారులను రాజకీయ అండతో తమ చెప్పుచేతల్లో ఉంచుకుని ఇష్టానుసారంగా భూ యజమానులను జాబితాల నుంచి తొలగించి తమ పేర్లను నమోదు చేయించుకున్నారు. రెవెన్యూ కార్యాలయాలు పైరవికారులతో అవినీతి కేంద్రాలుగా మారాయి. రిజిస్ట్రేషన్ కార్యాలయాలు, తహసీల్దార్ కార్యాలయాలపై తీవ్ర విమర్శలు వచ్చేందుకు పైరవీలే కారణమయ్యాయి. వీటన్నింటికి భూ భారతి పరిష్కారం చూపాల్సి ఉంది. ఇప్పుడు ఉన్న రికార్డుల ప్రకారమే భూ భారతి అమలైతే బహూశా సమస్యకు పరిష్కారం దొరకక పోవచ్చు. అసలు వాస్తవంగా గ్రామాల వారీగా భూ విస్తీర్ణమెంత, సాగు భూమి ఎంత సాగుకు యోగ్యం కాని భూమి ఎంత, అది ఏఏ రైతుల అనుభవంలో ఉందో తేల్చాల్సి ఉంది. కానీ ఇది భూ సర్వేతోనే సాధ్యమని రైతులు అభిప్రాయపడుతున్నారు. ధరణి మాదిరిగా కొత్త సమస్యను తేకుండా భూ సమస్యకు భూ భారతి పరిష్కారం చూపుతుందని ఆశిద్దాం.

# రైతు పేరుతో ఘరానా మోసం

**(మొదటిపేజీ తరువాయి)**

చెందిన ఓ రైతు తనకున్న రాజకీయ అండబలంతో ఈ అవకాశాన్ని ఆయుధంగా చేసుకొని అమాంతం ఇసుక వ్యాపారం మొదలుపెట్టారు.

**సత్తుపల్లి ఇసుక వ్యాపారుల నిర్వహణ...**

పాలేరు ఏటి ఒడ్డున ఉన్న నాయకను గూడెం గ్రామానికి చెందిన రైతు పొలంలో సత్తుపల్లి కి చెందిన ఇసుక వ్యాపారులు ఇసుకడంపును పొలం నుండి తరలించి భూమిని లెవెల్ చేస్తామని ఓ రైతు పేరుతో కూసుమంచి మండల ఓ రాజకీయ పార్టీ నాయకుల అండదండలతో ఎటువంటి అనుమతులు లేకుండా నాలుగు నెలలుగా రాత్రింబవళ్లు ఇసుకను తరలిస్తూ ప్రభుత్వానికి ఎటువంటి చలానాలు పన్ను లు కూడా చెల్లించకుండా రాజకీయ పలుకుబడి నే ఇసుక వ్యాపారం గా నిర్వహిస్తున్నారు. సదరు రైతు వరద తాకిడికి నష్టపోయిన పొలంపై పది సంవత్సరాల కాలం కంటే ఎక్కువ ఆదాయం వచ్చే విధంగా ఇప్పటికే అదనపు లాభాలతో తన ఇసుక వ్యాపారాన్ని మూడు పువ్వులు ఆరు కాయలుగా నిర్వహిస్తూ కొందరు ప్రభుత్వ అధికారులకు ఇసుక ట్రాక్టర్లను ఎక్కడ ఆపకుండా రాజకీయ నాయకులకు చేతులు తడుపుతూ అక్రమ ఇసుక వ్యాపారాన్ని నిర్వహిస్తున్నారని మండలంలో ప్రజల్లో తీవ్రమైన చర్చ జరుగుతోంది.

**ఏటి ఇసుక పొలంలో డంపు చేస్తూ వ్యాపారం...**

నాయకన్ గూడెం గ్రామానికి చెందిన రైతు పొలం సత్తుపల్లి కి చెందిన ఇసుక వ్యాపారులు పాలేరు ఏటి పక్కనే ఉండడం అవకాశం గా తీసుకొని గత నెలన్నర క్రితమే తన పొలంలో మేట వేసిన ఇసుకను తరలించగా మళ్లీ తిరిగి ఏటిలో ఇసుకను రాత్రింబవళ్లు జెసిపిలతో తోడి తన పొలంలో డంపు చేస్తూ ఈ ఇసుకంత గతంలో వరదకే వచ్చిందంటూ ఇంకా ఇసుక నాటకం ఆడుతూ అధికారులను రాజకీయ నాయకులను పలు విధాలుగా ఒప్పిస్తూ మెప్పిస్తూ మేపుతూ తన పబ్బం కడుపుకుంటూ అక్రమ ఇసుక వ్యాపారాన్ని అందకుండా నిర్వహిస్తున్నాడు.

**అడ్డుకోని అధికారులు...**

గత నాలుగు నెలలుగా పాలేరు ఏటి పక్కన జరుగుతున్న అక్రమ ఇసుక దందాపై కూసుమంచి మండలంలో పలు డిపార్ట్మెంట్లకు చెందిన అధికారులు బాధ్యతగా అదుపు చేయాల్సింది పోయి వారు తమకేమీ పట్టనట్లుగా తెలవనట్లుగా ఉండడం వల్లనే ఈ అక్రమ ఇసుక వ్యాపారం దందా నడుస్తుందని ప్రజల్లో తీవ్రంగా చర్చ జరుగుతున్నది.

**అంటి అంటనట్టుగా వ్యవహరిస్తున్న తహశీల్దార్...**

పాలేరు ఏటి పక్కన జరుగుతున్న అక్రమ ఇసుక వ్యాపారంపై కూసుమంచి తాసిల్దార్ కార్యాలయ సిబ్బంది ఏదో ఎవరైనా సమాచారం ఇస్తే తప్ప మేమే అంటూ అంటి ముట్టనట్లుగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు సీరియస్ గా స్పందించి ప్రభుత్వ ఆదాయానికి గండి పడకుండా ప్రజలకు సద్వినియోగం అయ్యేవిధంగా ఇసుక వ్యాపారాన్ని అడ్డుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

**తహసిల్దార్ కరుణశ్రీ వివరణ...**

మండలంలోని పాలేరు ఏటి ప్రక్కన నాయకన్ గూడెం రైతు పేరుతో అక్రమంగా నిర్వహిస్తున్న ఇసుక వ్యాపారంపై వివరణ కోరగా ఒకే మేం చూసుకుంటాము చేస్తాము. అంటూ సమాధానం చెప్పారు.

# యథేచ్ఛగా వడ్డీ వ్యాపారం..!

**(మొదటిపేజీ తరువాయి)**

ప్రవేట్ ఉద్యోగులు. కిరాణా షాపులు వడ్డీలు చెల్లించలేక విలవిల్లాడుతున్నారు. అడ్డుచెప్పేవారు లేకపోవడంతో వారి ఆగడాలకు అంతులేకుండా పోతోంది. అవసరాన్ని బట్టి రూ.10 నుంచి రూ.20 వరకు వడ్డీ లాగుతూ పేదలను దోపిడీ చేస్తున్నారు. నెలవారీ, డైలీ (రోజు) లేదా వారానికి ఒక రోజు కలెక్షన్ల పేరుతో వడ్డీకి డబ్బులిచ్చి రూ. కోట్లు గడిస్తున్నారు. ఈ వడ్డీ వ్యాపారుల ఒత్తిళ్లు తట్టుకోలేక కొందరు ఇళ్లు వదిలి వెళ్లిపోతుంటే.. వడ్డీ వ్యాపారులు ఖాళీ చెక్కులు, స్టాప్ పేపర్లపై సంతకాలు, రుణగ్రహీతల ఇళ్లు, స్థలాలను తాకట్టుపెట్టుకుని చివరకు దౌర్జన్యంగా వాటిని స్వాధీనం చేసుకుంటున్నట్లు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

**విచ్చలవిడిగా వడ్డీ...**

వడ్డీ వ్యాపారులు అప్పు కోసం వచ్చే వారిఅవసరాలను బట్టి ఒక్కొక్కరితో ఒక్కోరకంగా వడ్డీ వసూలు చేస్తున్నారు. చిన్న చిన్న వ్యాపారులు, తోపుడు బండ్లు, హూటళ్లు, కర్రీ పాయింట్స్, టి దుకాణాలు, తదితర వ్యాపారులు ఎక్కువగా ఏరోజు కారోజు జరిగే వ్యాపారం మీద ఆధారపడి జీవిస్తుంటారు. ఇలాంటి వారు పెట్టుబడి కోసండైలీ ఫైనాన్స్ వారిని ఆశ్రయిస్తే.. అవసరాన్ని బట్టి ఉదయం రూ.10వేలు ఇచ్చి.. సాయంత్రం రూ. 12 వేలు వసూలు చేస్తున్నారు. త ద్వారా రోజుకు అదనంగా ఒక్కొక్కరూ రూ.2000 చెల్లించాల్సిన దుస్థితి నెలకొంది. ఈ లెక్కన పేదలు చేస్తున్న వ్యాపారంలో వచ్చే ఆదాయం సగం ఫైనాన్స్ వారికే చెల్లించాల్సి వస్తోంది. డబ్బులు చెల్లించడంలో ఆలస్య మైనా, మళ్లీ వారి వద్దే అప్పు తీసుకోకపోయినా వారిపై పలు రకాలుగా ఒత్తిడి పెడుతున్నట్టు బాధితులు ఆరోపిస్తున్నారు..

**అనుమతి లేకుండానే...!**

ఏజెన్సీ ప్రాంతంలో ఎలాంటి అనుమతి లేకుండానే వ్యాపారులు విచ్చలవిడిగా వడ్డీ వ్యాపారం సాగిస్తున్నారు. ప్రధానంగా ఫైనాన్స్, తాకట్టు వ్యాపారాలు చేయాలన్న నిబంధనలు ప్రకారం అనుమతి తీసుకోవాల్సి ఉంది. రెవెన్యూ, రిజిస్ట్రేషన్, పోలీసుశాఖ ద్వారా లైసెన్సలు కలిగి ఉండాలి. లైసెన్సులు పొందిన వారు మాత్రమే నియమ నిబంధనలకు లోబడి వ్యాపారాలు కొనసాగించాలి. ఎలాంటి లైసెన్సులు లేవు. పోలీసు యంత్రాంగం ఇలాంటి వారిపై ప్రత్యేక నిఘా ఉంచి వారి దోపిడీకి కళ్లెం వేయాలని బాధితులు వాపోతున్నారు. అధిక వడ్డీలకు సంబంధించి కొందరు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేస్తే సంబంధిత వడ్డీ వ్యాపారులు పోలీసులకు కాసులు సమర్పించి చర్యలు తీసుకోకుండా చూసుకుంటున్నారని కొందరు బాధితుల ద్వారా తెలుస్తోంది. మరికొందరు పోలీసులైతే కేసులు నమోదు చేయకుండా వడ్డీ వ్యాపారులకు అనుగుణంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి.

**చిరు వ్యాపారస్తులే లక్ష్యంగా...**

కరకగూడెంలో వడ్డీ వ్యాపారుల కొంత రకం దోపిడీకి తెరలేపారు.




సామాన్యులు, మధ్యతరగతి వారికి వడ్డీకి ఇస్తే సక్రమంగా చెల్లించలేరనే ఉద్దేశంతో చిరు వ్యాపారస్తులకు, ప్రవేట్ ఉద్యోగులు లక్ష్యంగా చేసుకుంటున్నారు. ఆర్థిక ఇబ్బందులున్న చిరు వ్యాపారులు, ప్రవేట్ ఉద్యోగులను తెలుసుకుని వారికి రూ.100 కు రూ.10 నుంచి వారి అవసరాలను బట్టి మరింత రెట్టింపు వడ్డీలతో అప్పు ఇచ్చి సొమ్ము చేసుకుంటున్నారు. కొందరు వడ్డీ వ్యాపారులు ఉద్యోగుల వద్ద ఏటీంఎ కార్డులు, బ్యాంకు పాస్ పుస్తకాలు తీసుకుని అప్పుగా డబ్బులు ఇస్తున్నారు. ఇలా పలు రకాల గ్యారెంటీలతో వడ్డీ వ్యాపారులు మండలంలో ప్రజల శ్రమను దోచుకుని కోట్లకు పడగలెత్తుతున్నారు. రుణ గ్రహీతలు మాత్రం వడ్డీలు చెల్లించలేక నానా అవస్థలు పడుతున్నారు.

**వడ్డీ ముందే కట్...**

వడ్డీ వ్యాపారులు అప్పు ఇచ్చేటప్పుడు ముందుగానే వడ్డీ కట్ చేసుకొని మిగితా డబ్బులు ఇస్తున్నారు. వీటిని రోజువారీగా వసూలు చేస్తుంటారు. లేదా వారానికి ఒకసారి వసూలు చేస్తున్నారు. దీంతో చేసిన కష్టం వడ్డీలకే సరిపోతోందని చిరు వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు అనుమతుల్లేని ఫైనాన్స్ వ్యాపారులపై దృష్టి సారించి చర్యలు తీసుకోవాల్సిన పలు రాజకీయ నేతలు, ఎన్ఎస్ఎఫ్ సంఘాలు, గిరిజన సంఘాలు, ప్రజా సంఘాల నాయకులు ముక్తకంఠంతో కోరుతున్నారు.

**రోజువారీ వసూళ్లు....**

సాయంత్రం సమయంలో కూరగాయల మార్కెట్లు, టీకొట్టులు, చిరు వ్యాపారులు, పాన్డేలాలు, చికెన్, మటన్ దుకాణాలు, లారీ ఓనర్లు, ఆటో, మ్యాజిక్ డ్రైవర్ల నుంచి వడ్డీ వసూలు చేస్తుంటారు. రోజువారిగా వసూలు చేసే వారు రూ. 10 వేల అప్పు కోసం ముందుగానే రెండు వేలు వడ్డీ కింద తీసుకొని రూ. 8 వేలు ఇస్తారు. అప్పుదారుడు రోజుకు రూ.200 చొప్పున 50 రోజుల పాటు చెల్లిస్తే రూ. 10 వేల అప్పు తీరుతుంది. అంటే 50 రోజులకు రూ. 2వేలు వడ్డీ అన్నమాట. ఏజెన్సీ ప్రాంతంలో అధికారులు దృష్టి సారించి అధిక వడ్డీల నుంచి ప్రజలను కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు కోరుతున్నారు.

# ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి లబ్దిదారులకు మంజూరైన చెక్కులను ఎంఎల్‌సి తాతా మధుసూదన్ పంపిణీ చేశారు. మంగళవారం బిఆర్ఎస్ పార్టీ కార్యాలయం తెలంగాణ భవన్ నందు జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఎంఎల్‌సి తాతా మధుసూదన్ సిఫారసుతో 65 మంది లబ్దిదారులకు మంజూరైన రూ.17.44 లక్షల విలువ గల చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేదలకు సహయంగా నిలిచే సిఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం కోతలు విధించడం పట్ల విచారం వ్యక్తం చేశారు. అనారోగ్యంతో బాధపడుతూ లక్షలాది రూపాయలు ఖర్చు చేసినా రూ. 60వేలు అందించే విధానాన్ని వీడాలన్నారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షులు పగడాల నాగరాజు, రూరల్ అధ్యక్షులు బెల్లం వేణుగోపాల్, వీరన్న, కనగాల వెంకట్రావు, రావూరి శ్రీనివాసరావు, కారుమూరి వెంకటేశ్వర్లు, మాజీ ఎంపిపి సామినేని హరిప్రసాద్, పోట్ల శ్రీనివాస్, మల్లయ్య, తాతా ప్రసాద్, పగడాల నరేందర్, నాయకులు పాల్గొన్నారు.

**ఆర్‌జెసి, కూరాకులను పరామర్శించిన ఎంఎల్‌సి...**

డిసిసిబి మాజీ ఛైర్మన్ కూరాకుల నాగభూషణం, మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ ఆర్‌జెసి కృష్ణలను ఎంఎల్‌సి, బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు తాతా మధుసూదన్ పరామర్శించారు.కూరాకుల నాగభూషణం ఇటీవల సత్తుపల్లి వెళ్తుండగా నూతన కలెక్టరేట్ వద్ద గేదె రోడ్డుకు అడ్డురాగా కారు అదుపుతప్పి ప్రమాదానికి గురైంది. కారులో ప్రయాణిస్తున్న నాగభూషణంతో పాటు భార్యకు స్వల్ప గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న ఎంఎల్‌సి తాతా మధుసూదన్ వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు. అదేవిధంగా ఇటీవల కాలుకు శస్త్ర చికిత్స చేయించుకున్న ఆర్‌జెసి కృష్ణ ఎంఎల్‌సి తాతా మధుసూదన్ వారి స్వగృహంకు వెళ్లి పరామర్శించారు. ఆరోగ్య యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షులు పగడాల నాగరాజు, కార్పొరేటర్ వలరాజు, నాయకులు శ్రీనివాస్, ధనాల శ్రీకాంత్, రవినాయక్, దిలీప్‌చౌదరి, సద్దాం షేక్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పథకాలు అర్హులకు అందేలా కార్యాచరణ

-దరఖాస్తుల స్క్రూటినీ ప్రక్రియకు ఏర్పాట్లు చేయాలి
-అధికారులతో ఇంచార్జి కలెక్టర్ శ్రీజ సమీక్ష





**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న పథకాల లబ్ది అర్హులకు అందేలా పకడ్బందీగా కార్యాచరణ అమలు చేయాలని ఇంచార్జి కలెక్టర్ డా॥ పి. శ్రీజ తెలిపారు. మంగళవారం ఇంచార్జి కలెక్టర్ పి.శ్రీజ కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో అధికారులతో రాజీవ్ యువ వికాసం, ఇందిరమ్మ ఇండ్లు, త్రాగునీరు, భూ భారతి లపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ మాట్లాడుతూ యువతకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించడం కోసం రాజీవ్ యువ వికాసం పథకం ప్రవేశపెట్టినట్లు, ఈ పథకం ద్వారా చిన్నతరహా పరిశ్రమలు లేదా యూనిట్ల ఏర్పాటుకు యువతకు సబ్సిడీతో నాలుగు లక్షల వరకు ఆర్థిక సాయం అందించనున్నట్లు ఆమె తెలిపారు. జిల్లాలో ఎస్సి కార్పోరేషన్ ద్వారా 29091, గిరిజన సంక్షేమ శాఖ ద్వారా 14220, బిసి కార్పోరేషన్ ద్వారా 41881, మైనార్టీ కార్పోరేషన్ ద్వారా 6658 దరఖాస్తులు మొత్తం 91850 దరఖాస్తులు సోమవారం నాటికి అందినట్లు ఆమె తెలిపారు. అన్ని దరఖాస్తులు ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తి చేసినట్లు ప్రభుత్వ ఆదేశాల ప్రకారం దరఖాస్తుల పరిశీలన ప్రక్రియకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల విషయమై అర్హులై ప్లాట్లు ఉన్న ఎల్1 జాబితాను ఎంపిడివో సంతకంతో తీసుకుని ఆమోదం కొరకు ఇందిరమ్మ కమిటీ ముందు ఉంచాలన్నారు. ఇందిరమ్మ కమిటీ ఆమోదం తర్వాత మండల ప్రత్యేకాధికారి ఆ జాబితాను జిల్లా ఇంచార్జి మంత్రి వర్యుల ఆమోదం కొరకు సమర్పించాలన్నారు. ఇంచార్జి మంత్రుల ఆమోదం తప్పనిసరి అని తెలిపారు. వేసవి దృష్ట్యా జిల్లాలో త్రాగునీటికి ఎక్కడ సమస్యలు తలెత్తకుండా అన్ని చర్యలు చేపట్టాలని ఇంచార్జి కలెక్టర్ తెలిపారు. నియోజక వర్గాల వారీగా కావాల్సిన పనుల విషయమై నివేదిక సమర్పించాలన్నారు. ఇంట్రా, గ్రిడ్‌లకు 1లేదా 2 బఫర్‌లు పెట్టాలన్నారు. కొత్తగా హబిటేషన్‌లు కొత్త కాలనీలు ఏర్పడ్డ చోట పైపులైన్ పొడిగింపులకు చర్యలు తీసుకోవాలన్నారు. అత్యవసర త్రాగునీటి అవసరాల నిమిత్తం కలెక్టర్ వద్ద నిధుల మంజూరుకు పనుల గుర్తింపు వెంటనే చేపట్టాలన్నారు. భూ భారతి అమలుకు ప్రభుత్వం చర్యలు చేపడుతున్నట్లు ఇంచార్జి కలెక్టర్ తెలిపారు. భూ భారతి అమలు విషయమై పైలెట్ ప్రాజెక్టు క్రింద జిల్లాలోని నేలకొండపల్లి మండలాన్ని ఎంపిక చేసినట్లు ఆమె తెలిపారు. మండల హెడ్ క్వార్టర్స్‌లో భూ భారతి చట్టం అమలుపై అవగాహన కార్యక్రమం చేపడతామన్నారు. గ్రామాల్లో రెవెన్యూ సదస్సుల ఏర్పాటుకు షెడ్యూల్ రూపొందించాలన్నారు. గ్రామాల్లో రెవెన్యూ సదస్సుల విజయవంతానికి తహసీల్దార్, ఎంపిడివో, ఎంపివో, పంచాయతీ కార్యదర్శులు సమన్వయంతో లబ్దిదారుల సమీకరణ , అవగాహన కల్పనకు పటిష్టమైన ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ సమావేశంలో జెడ్పిసిఈవో దీక్షారైనా, జిల్లా పంచాయతీ అధికారిణి ఆశాలత, మిషన్ భగీరథ ఈఈ పుష్పలత, ఖమ్మం ఆర్డివో జి. నర్సింహారావు, ఎంపిడివోలు, ఎంపివోలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నేలమట్టమైన రైస్‌మిల్లును సందర్శించిన మాస్‌లైన్ బృందం



**ప్రజాపక్షం/ తల్లాడ :** మండల పరిధిలోని కుర్నవల్లి గ్రామంలో నేలమట్టమైయిన సొసైటీ రైస్ మిల్లును సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ బృందం మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా మాస్‌లైన్ జిల్లా నాయకులు ఎస్కె లాల్మియా మాట్లాడుతూ 2020 సంవత్సరంలో కుర్నవల్లి గ్రామంలో సొసైటీ బలోపేతం కోసం రాష్ట్ర ప్రభుత్వం నాబార్డ్ ద్వారా రూ.2కోట్లు మంజూరు చేసి రైస్ మిల్లు నిర్మాణం చేపట్టడం జరిగిందన్నారు. రైస్ మిల్లు నిర్మాణ సమయంలో అధికారుల పర్యవేక్షణ లేకపోవడం పాలకవర్గం నిర్లక్ష్యంతో నాబార్డ్ నిధులు ద్వారా చేపట్టిన రైస్ మిల్లు సంబంధించిన షెడ్డు నేలమట్టమైందని అన్నారు. వారంరోజుల క్రితం కేశపురం గ్రామంలో పైళ్ల మాధవికి చెందిన డబుల్ బెడ్ రూమ్ ఇంటి మెట్లు కూలిపోయాయని గుర్తు చేశారు. టిఆర్ఎస్ పరిపాలన రాజుల సొమ్ము రాళ్లపాలైనట్లుగా ప్రజల సొమ్మును కాంట్రాక్టుల కడుపు నింపుకున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే స్పందించి దీనిపై విచారణ జరిపించి బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తల్లాడ మండల కార్యదర్శి కె.వెంకటేశ్వర్లు, సహాయ కార్యదర్శి డి.శ్రీనివాసరావు, నతానేలు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# కాంటా కోసం బారులు తీరిన లారీలు

-గాంధీచౌక్ నుంచి పందిళ్లపల్లికి మార్చిన రైల్వే లోడింగ్





**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** మొక్కజొన్న కాంటా (తూకం) కోసం లారీలు బారులు తీరాయి. గాంధీచౌక్ రైల్వే స్టేషన్‌లో ఉన్న గూడ్స్ రైలు లోడింగ్ పాయింట్‌ను రైల్వే అధికారులు పందిళ్లపల్లి రైల్వే స్టేషన్‌కు మార్చారు. దీనితో ఆ ప్రాంతంలో కాంటాలు వేసేందుకు వే బ్రిడ్జిలు లేకపోవడంతో మొక్కజొన్న కొనుగోలు చేసిన వ్యాపారులు కాంటాల కోసం అల్లిపురం మమత క్రాస్ రోడ్డు వద్ద గల వే బ్రిడ్జికి వస్తున్నాయి. దీనితో ఆ ప్రాంతమంతా రద్దీగా మారింది. వందలాది లారీలు రోడ్డుకు ఇరువైపులా కాంటాల కోసం గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇరువైపులా లారీలు ఆపడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రధాన రహదారులతో పాటు అంతర్గత రహదారులపై కూడా అధిక బరువున్న లారీలు తిరగడంతో రోడ్లు దెబ్బతింటున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికారులు దృష్టి సారించి తగు చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

# ఐకెపి ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



**ప్రజాపక్షం/ మధిర :** మధిర మండలంలోని వంగవీడు గ్రామంలో ఐకెపి వారి ఆధ్వర్యంలో ప్రభుత్వం రైతుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మధిర మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నర్సింహారావు మంగళవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని, పండించిన ప్రతి గింజను కొనుగోలు చేస్తామన్నారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో మాత్రమే విక్రయించి మద్దతు ధర పొందాలని, సన్నరకం వడ్లకు రాష్ట్ర ప్రభుత్వం రూ.500బోనస్ ప్రకటించిందన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సూరంశెట్టి కిషోర్, మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షులు ఐలూరి సత్యనారాయణ రెడ్డి, కమిటీ డైరెక్టర్లు అద్దంకి రవికుమార్, దారా బాలరాజు, యూత్ నాయకులు తూమాటి నవీన్‌రెడ్డి, నాయకులు కర్నాటి రామారావు, నిడమనూరు వంశీకృష్ణ, చిలువేరు బుచ్చిరామయ్య, ఓబుల్ లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఏప్రిల్ 17న మహిళలకు జాబ్‌మేళా

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** జిల్లాలోని నిరుద్యోగ మహిళలకు రిలయన్స్ నిప్పాన్ లైఫ్ ఇన్సూరెన్స్ ప్రైవేటు రంగంలో ఉద్యోగాలు కల్పించుటకు ఈనెల 17న జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారిణి మాధవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 17న గురువారం ఉదయం 10 గంటలకు ఖమ్మం గాంధీచౌక్‌లోని కోటక్ మహీంద్ర బ్యాంకు పైన ఉన్న రిలయన్స్ నిప్పాన్ లైఫ్ ఇన్సూరెన్స్ కార్యాలయం నందు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. 30 నుంచి 45 ఏళ్ల వయస్సు కలిగి డిగ్రీ పాసైన మహిళలు అర్హులని. ఎంపికైన వారికి వేతనం రూ. 20వేల నుంచి రూ. 25వేల వరకు ఉంటుందని ఆమె తెలిపారు. ఎంపికైన వారు ఖమ్మంజిల్లాలో పని చేయాల్సి ఉంటుందని తెలిపారు. మొత్తం 20 ఉద్యోగాల భర్తీకి గాను జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. తమ విద్యార్హతల సర్టిఫికెట్ జిరాక్స్ కాపీలతో మహిళలు జాబ్‌మేళాకు హాజరు కావాలని జిల్లా ఉపాధి అధికారిణి కోరారు.

# ప్రత్యేక అధికారుల నియామకం



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** జిల్లాలో ఇందిరమ్మ ఇండ్లు, రాజీవ్ యువ వికాసం పథకాలు అర్హులైన లబ్దిదారులకు అందేలా పటిష్ట పర్యవేక్షణకు నియోజక వర్గ స్థాయి ప్రత్యేక అధికారులను నియమిస్తూ ఇంచార్జ్ కలెక్టర్ పి. శ్రీజ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఖమ్మం నియోజక వర్గానికి జెడ్పిసిఈవో దీక్షారైనా, పాలేరు నియోజక వర్గానికి ఎస్‌డిసి ఎం. రాజేశ్వరి, మధిర నియోజక వర్గానికి జిల్లా పంచాయతీ అధికారిణి ఆశాలత, వైరా నియోజక వర్గానికి డివిజనల్ పంచాయతీ అధికారి టి. రాంబాబు, సత్తుపల్లి నియోజక వర్గానికి ఎల్. రాజేందర్ గౌడ్‌లు ప్రత్యేకాధికారులుగా నియమించినట్లు ఉత్తర్వులో తెలిపారు. దరఖాస్తుల సర్వే, వంద శాతం అర్హులైన లబ్దిదారుల ఎంపిక ప్రక్రియకు నియోజక వర్గ ప్రత్యేకాధికారులు క్షేత్ర స్థాయిలో పర్యవేక్షణ చేస్తారన్నారు. పథకాల గ్రౌండింగ్‌కు నియోజక వర్గ ప్రత్యేకాధికారులు చర్యలు చేపట్టాలని, ఒక ఫిర్యాదు రాకుండా ప్రత్యేక శ్రద్దతో పర్యవేక్షణ చేపట్టాలని ఇంచార్జ్ కలెక్టర్ ఆదేశించారు.

# సీఎం సహాయనిధి చెక్కు అందజేత



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్:** ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని ఏదులాపురం గ్రామానికి చెందిన తేనె వీరభద్రంకు సీఎం సహాయనిధి నుంచి రూ.50వేల సీఎంఆర్ఎఫ్ చెక్కు మంజూరయ్యింది. వైద్య ఖర్చుల కోసం ఎమ్మెల్సీ తాత మధు సిఫారస్‌తో బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు బెల్లం వేణు చొరవతో అందింది. అక్కడి బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో బాధితుడి ఇంటి వద్దకు వెళ్లి చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంపటి ఉపేందర్, ఎండీ మైబల్‌సాబ్, నారపాటి రమేష్, అట్టూరి వీరబాబు, తమ్మనబోయిన ఫనికుమార్, గరిక కృపాకర్, దాట్ల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# తడిసిన ధాన్యాన్ని పరిశీలించిన సండ్ర



**ప్రజాపక్షం/ తల్లాడ :** తల్లాడ మండలం గొల్లగూడెం గ్రామంలో ఇటీవల అకాల వర్షాలతో తడిసిన ధాన్యాన్ని మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులను పంట నష్ట వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గాలి దుమ్ములతో కూడిన అకాల వర్షం కారణంగా రైతు ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యం తడిసి ముద్దయిందని, నోటి కాడికి వచ్చిన ధాన్యం తడిసి ఒక్కసారిగా నష్టం వాటిల్లడంతో రైతులు గగ్గోలు పెడుతున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి నష్టపోయిన రైతులను గుర్తించి తక్షణమే నష్టపరిహారం చెల్లించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు రెడ్డెం మోహన్‌రెడ్డి, నాయకులు దుగ్గిదేవర వెంకట్‌లాల్, దగ్గుల శ్రీనివాస్‌రెడ్డి, కోడూరి వీరకృష్ణ, ఎమ్మార్పీఎస్ నాయకులు ఇస్నపల్లి అశోక్, రైతులు పాల్గొన్నారు.

# యర్రా శ్రీకాంత్‌కు ఘన నివాళి



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్:** ఖమ్మం రూరల్ మండలంలోని మంగళగూడెం, పల్లెగూడెం, పోలేపల్లి గ్రామాల్లో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు యర్రా శ్రీకాంత్ సంతాప సభలను మండల కమిటీపార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా చిత్రపటాలను ఏర్పాటు చేసుకొని పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి ఊరడి సుదర్శన్‌రెడ్డి, నాయకులు వల్లమూడి నాగేశ్వరరావు, కొప్పుల ఉపేందర్, కొప్పుల రామయ్య, మద్ది వెంకట్‌రెడ్డి, దుండిగల రాంబాబు, మునగాల లాల్‌బాబు, వెంకటేష్, రమేష్, శ్రీను, నాగేశ్వరరావు, లక్ష్మి , జయమ్మ, సునీత, పార్వతి, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

# 17న విద్యుత్ వినియోగదారుల సదస్సు

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** విద్యుత్ నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్ ఖమ్మం సర్కిల్ పరిధిలో హెచ్‌టి విద్యుత్ వినియోగదారుల సదస్సు ఈనెల 17న గురువారం నిర్వహిస్తున్నట్లు ఖమ్మం సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ ఇనుగుర్తి శ్రీనివాసాచారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 17న ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు మామిళ్లగూడెం సాయిబాబా గుడి వద్ద గల ఖమ్మం సర్కిల్ కార్యాలయం నందు ఈ సదస్సు జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో సూపరింటెండెంట్ ఇంజనీర్, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్, డివిజనల్ ఇంజనీర్స్, అకౌంట్స్ స్టాఫ్ హాజరై సంబంధిత వినియోగదారుల సమస్యలు పరిష్కరిస్తారని ఆయన తెలిపారు. హెచ్‌టి వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## చిన్ననాటి స్నేహితుడికి ఆర్థికసాయం



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్:** చిన్నతనంలో ఆడి పడి చదువుకున్న స్నేహితుడి కష్టాన్ని సోషల్ మీడియా ద్వారా తెలుసుకొని బాల్య మిత్రులు చెలించారు. అందరు ఒక్కటై తల ఇంత డబ్బులను వేసుకొని మిత్రుడికి అందించి తమ స్నేహ నీరతిని చాటిచెప్పారు. ఖమ్మంరూరల్ మండలంలోని కాచిరాజుగూడెంపరిధిలోని వాల్యతండకు చెందిన మాలోత్ వినోద్‌కు రెండు నెలల క్రితం రోడ్డు ప్రమాదం జరిగి కాలు ఫ్యాచ్చర్ అయ్యింది. రెక్కడితె కానీ డొక్కాడని పరిస్థితిలో సహాయం చేయాలని సోషల్ మీడియా ద్వారా అర్జించాడు. దీనిని అతనితో 20082009 సంవత్సరంలో మహబూబబాద్ జిల్లా, డోర్నకల్ మండలం, ములకలపల్లి గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో పదవ తరగతి చదివిన విద్యార్థులు స్పందించారు. తమ చిన్ననాటి మిత్రుడి ఇంటివద్దకు చేరుకొని మనసార పరామర్శించి, ఆర్థికసాయంతో పాటు బియ్యం అందజేశారు. భవిష్యత్తులో ఎలాంటి సమస్య వచ్చిన మేమున్నాం అని భరోసాను కల్పించారు. నేను, తన కుటుంబం నా మిత్రులకు జీవితకాలం రుణపడి ఉంటామని వినోద్ పేర్కొన్నాడు. ఈ కార్యక్రమంలో మిత్రబృందం పాల్గొన్నారు.

## ముమ్మరంగా టియుడబ్ల్యూజే సభ్యత్వం నమోదు



**ప్రజాపక్షం/ మధిర :** మధిర నియోజకవర్గ కేంద్రంలో మంగళవారం టియుడబ్ల్యూజే(ఐజేయు) సభ్యత్వ నమోదు కార్యక్రమం స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో నిర్వహించారు. వివిధ పత్రికలు, చానళ్లకు చెందిన సీనియర్ జర్నలిస్టులు హాజరై ప్రసంగించారు. అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, హెల్త్ కార్డులు ఇవ్వాలని తీర్మానం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.

## అమెరికాలో ఎన్ఆర్ఐ వెలగపూడి రమేష్ అనారోగ్యంతో మృతి



**ప్రజాపక్షం/ మధిర రూరల్ :** మధిర మండలం ఆత్కూరు గ్రామానికి చెందిన వెలగపూడి హన్మంతరావు సోదరుడు వెలగపూడి రమేష్ అమెరికాలో అనారోగ్యంతో మృతి చెందారు. అమెరికాలో డల్లాస్‌లో రమేష్ సాఫ్ట్వేర్‌గా పనిచేస్తూ నివాసముంటున్నాడు. బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో అక్కడే చికిత్స కోసం ఆసుపత్రిలో చేర్పించగా మృతి చెందాడు. మృతదేహాన్ని అమెరికా నుండి స్వగ్రామానికి తీసుకువచ్చేందుకు రమేష్ ఫ్రెండ్స్, తానా కమిటీ వారు ఏర్పాటు చేస్తున్నారు. మరో 5రోజుల్లో మృతదేహాన్ని తీసుకువచ్చే అవకాశాలు ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. రమేష్ మృతితో స్వగ్రామంలో బంధువుల్లో విషాదచాయలు అలుముకున్నాయి.

## సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి




**ప్రజాపక్షం/ మధిర :** కేంద్రంలోని ప్రధాని నరేంద్రమోడీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని బిజెపి ఖమ్మం పార్లమెంట్ అభ్యర్థి తాండ్ర వినోద్ రావు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ బిజెపి ఆధ్వర్యంలో గ్రామ చలో బస్తీ చలో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. రైతుల కోసం మిర్చి బోర్డు, పామాయిల్ బోర్డ్ ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. అనంతరం మధిరలో పర్యటించిన ఆయన తన దృష్టికి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ప్రజలకు హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో బిజెపి జిల్లా అధ్యక్షులు గల్లా సత్యనారాయణ, కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి, మధిర నియోజకవర్గ అసెంబ్లీ కన్వీనర్ ఏలూరి నాగేశ్వరరావు, బిజెపి ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## గుండెపోటుతో మల్టీపర్సర్ వర్కర్ మృతి

**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్:** ఖమ్మం రూరల్ మండలం ఏదులాపురంమున్సిపాలిటీలోని పెద్దతండ కార్యాలయంలో మల్టీపర్పస్ వర్కర్‌గా పని చేస్తున్న ఎస్‌కే బూరన్‌బీ(60) గుండెపోటుతో ముస్తాఫనగర్‌లోని తన నివాసంలో సోమవారం రాత్రి మృతి చెందింది. మంగళవారం విషయం తెలుసుకున్న కమిషనర్ ఆళ్ల శ్రీనివాస్‌రెడ్డి మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే అంత్యక్రియలకు రూ.10వేలను ఆర్థికసాయంగా కుటుంబ సభ్యులకు అందజేశారు. మృతురాలికి ఇద్దరు కుమారులు ఉన్నారు. నివాళులర్పించిన వారిలో రెవిన్యూ,పబ్లిక్‌రిలేషన్ అధికారి శ్రీధర్‌రెడ్డి, మేనేజర్ వాణి, సిబ్బంది, కాంగ్రెస్ నాయకులు బానోత్ కిషోర్ తదితరులు ఉన్నారు.

# భవిత కేంద్రాలు బాసటగా నిలవాలి

**-భవిత కేంద్రాలు అధునీకరణ చేపట్టాలి**
**-ఇంచార్జ్ కలెక్టర్ శ్రీజ**




**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** మానసిక, శారీరక వైకల్యంతో బాధపడే బాలలకు భవిత కేంద్రాలు బాసటగా నిలవాలని ఇంచార్జ్ కలెక్టర్ డా।।పి. శ్రీజ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో అధికారులతో భవిత కేంద్రాల అధునీకరణపై ఇంచార్జ్ కలెక్టర్ డా।। పి. శ్రీజ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో ఎనిమిది భవిత కేంద్రాలు ఉన్నాయని ఇందులో ప్రత్యేక అవసరాల పిల్లలు విద్యతో పాటు వారిని సాధారణ పిల్లలుగా తీర్చిదిద్దుటకు చర్యలు చేపడుతున్నట్లు ఆమె తెలిపారు. మోడల్ అంగన్‌వాడీ కేంద్రాలను తీర్చిదిద్దుతున్నట్లుగా భవిత కేంద్రాలను మోడల్ భవిత కేంద్రాలుగా తీర్చిదిద్దాలన్నారు. భవిత కేంద్రాలలో ఏమేమి అవసరాలు ఉన్నాయో, నిష్ణాతులైన బృందం కాంపౌండ్ వాల్, మరుగుదొడ్లు, బెంచీలు, ఉపకరణాలు, వీల్‌చైర్లు తదితర అన్ని రకాల సౌకర్యాల కల్పనకు చర్యలు చేపట్టాలన్నారు. భవిత కేంద్రాలలో పిల్లలు ఎక్కువగా నమోదై అవసరాలు ఉన్న దానిని పూర్తి స్థాయిలో అధునీకరణకు వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. ఒక వేళ భవనం శిథిలావస్థలో ఉంటే కొత్త భవనం నిర్మాణానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఇందుకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేసి శనివారం లోగా సమర్పించాలన్నారు. అవసరం ఉన్న చోట రవాణాకు బస్సు సౌకర్యం గురించి ప్రణాళికలు చేయాలన్నారు. త్రీ మెన్ కమిటీ భవిత కేంద్రాలను క్షేత్రస్థాయిలో తనిఖీలు చేసి కేంద్రంలో ఉన్న విద్యార్థుల సంఖ్యను బట్టి ఎలాంటి డిజైన్, కావాల్సిన వసతులు, ఉపకరణల గురించి కార్యాచరణ చేయాలన్నారు. మే నెలలో చేపట్టే బడిబాట కార్యక్రమంలో ఐఈఆర్‌పిలు ప్రత్యేక అవసరాలు గల పిల్లల గుర్తింపు సర్వే చేపట్టి వారు ఏ పాఠశాల, ఎక్కడ విద్యను అభ్యసిస్తున్నది ఒక వేళ ఇంట్లోనే ఉంటే దగ్గరలోని భవిత కేంద్రానికి మ్యాపింగ్ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. డోర్ టు డోర్ సర్వే చేపట్టి ఈ ప్రక్రియను ఖచ్చితత్వంతో చేయాలన్నారు. మండలాల వారీగా పదవ తరగతి పూర్తయిన వారి జాబితాను తీసుకుని వారు ప్రభుత్వ కళాశాలల్లో నమోదయ్యేలా కార్యాచరణ చేయాలన్నారు. జిల్లాలో 14 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు వీటితో పాటు ప్రభుత్వ కేజిబివి, రెసిడెన్షియల్ కళాశాలలు ఉన్నట్లు తెలిపారు. వీటిలో 100 శాతం నమోదులు జరిగేలా పటిష్ట కార్యాచరణ అమలు చేయాలని ఇంచార్జ్ కలెక్టర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి కె. రాంగోపాల్‌రెడ్డి, విద్యాశాఖ ఆర్ఎంవో రాజశేఖర్, త్రీ మెన్ కమిటీ సభ్యులైన మండల విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## తనికెళ్లలో ముగిసిన కబడ్డీ పోటీలు

**విజేతలకు బహుమతుల అందజేత**



**ప్రజాపక్షం/కొణిజర్ల :** మండల పరిదిలోని తనికెళ్ల గ్రామశాఖ ఆధ్వర్యంలో గత మూడురోజులుగా ఆడుతున్న కబడ్డీ పోటీలు సోమవారం రాత్రి ముగిశాయి. హోరాహోరీగా సాగిన ఆటల్లో పెద్ద ఎత్తున యువకులు పాల్గొన్నారు. మొదటి బహుమతి రూ 50,000 లను కొణిజర్ల గ్రామానికి చెందిన పెరిక కౌశల్య మెమోరియల్ టీమ్ గెలుచుకుంది. రెండో బహుమతి రూ 40,000 లను కోసూరి యూత్ సాధించింది. మూడో బహుమతి రూ 30,000 లు కర్నాటక టీమ్ గెలుచుకుంది. నాల్గవ బహుమతి రూ 25,000 లు కొత్తగూడెం టీమ్ సాధించింది. ఐదవ బహుమతి రూ 20,000 లు ఇండో ఖతార్ ప్రాజెక్ట్ కౌవసం చేసుకుంది. ఆరవ బహుమతి రూ 15,000 లు తనికెళ్లకు చెందిన కింగ్స్ యూత్ గెలుచుకుంది. ఏడవ బహుమతి రూ 10,000 లు చెరువుమాదారం టీమ్ సాధించింది. ఎనిమిదవ బహుమతి రూ 5000 లు తనికెళ్లకు చెందిన రాజు క్లబ్ సాధించింది. విజేతలకు నగదు బహుమతి, షీల్డ్‌ను కబడ్డీ నిర్వాహకులు అందజేశారు. మూడురోజులపాటు నిర్విరామంగా ఆటలను మంచి ఉత్సాహవంత వాతావరణంలో గ్రామానికి చెందిన పత్తి లాలయ్య, ఇండ్ల రాజు నిర్వహించారు. క్రీడాకారులకు ఎలాంటి లోటు రానివ్వకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. కబడ్డీ పోటీలు చూసేందుకు గ్రామంలోని ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. గ్రామంలో చాలా సంవత్సరాలుగా కబడ్డీ పోటీ నిర్వహించకపోవడంతో నిర్వాహకులకు ఆర్థికంగా గ్రామంలోని కొంతమంది సహాయ సహకారాలు అందజేశారు. వారందరికి నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

## 27న జరిగే రజతోత్సవ మహాసభకు తరలి రండి

**బిఆర్ఎస్ శ్రేణులకు పిలుపునిచ్చిన మదన్‌లాల్, కొండబాల**







**ప్రజాపక్షం/ఖమ్మం :** భారత రాష్ట్ర సమితి రజతోత్సవ మహాసభను ఈ నెల27న వరంగల్ జిల్లా ఎల్కతుర్తి గ్రామంలో నిర్వహించనున్నారు. ఈ రజతోత్సవ మహాసభకు ప్రజలు కదం తొక్కాలని వైరా నియోజకవర్గ బిఆర్ఎస్ ఇంచార్జి, మాజీ శాసనసభ్యులు బానోతు మదన్‌లాల్ అన్నారు. వైరాలో శ్రీనికేతన్ పాఠశాల ఆవరణలో జరిగిన వైరా మండల మున్సిపాలిటీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే బానోతు మదన్‌లాల్, మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బానోతు మదన్‌లాల్ మాట్లాడుతూ గ్రామగ్రామాన నుండి పెద్ద ఎత్తున బిఆర్ఎస్ శ్రేణులు తరలిరావాలని ఆయన అన్నారు. వైరా నియోజకవర్గం నుంచి సుమారు 20వేల మంది బిఆర్ఎస్ కార్యకర్తలు ఎల్కతుర్తి మహాసభకు తరలివెళ్లడం జరుగుతుందని ఆయన తెలిపారు. బిఆర్ఎస్ పాలనలో అభివృద్ధి పెద్ద ఎత్తున జరిగిందని, రైతులు సంతోషంగా ఉన్నారని అన్ని వర్గాల ప రజలు ఆనందంగా ఉన్నారని తెలిపారు. బిఆర్ఎస్ శ్రేణులు ఎక్కడ అధైర్యపడాల్సిన పనిలేదని రానున్న రోజుల్లో మళ్లీ రాష్ట్రంలో కెసిఆర్ సారథ్యంలో ప్రభుత్వం ఏర్పాటు కావడం తథ్యమని ఆయన అన్నారు. 27న జరిగే మహాసభకు జన ప్రభంజనం కొనసాగుతుందని ఆయన తెలిపారు. ఊరూరునా స్వచ్ఛందంగా బిఆర్ఎస్ రజోత్సవ సమావేశాలకు తరలిరానున్నారు. కొట్లాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో కెసిఆర్ పాలనలో చెరువులు, కుంటలు, వాగులు, వంకలు ప్రాజెక్టులు నీటితో కళకళలాడాయని ఆయన గుర్తు చేశారు. మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజలు మళ్లీ కెసిఆర్ పాలన కావాలని కోరుకుంటున్నారని కెసిఆర్ పాలన వస్తేనే సంక్షేమ పథకాలు అన్ని అందుతాయని ప్రజలు ఎదురుచూస్తున్నారన్నారు. 27న జరిగే సభకు వైరా మండలం నుండి పెద్ద ఎత్తున ప్రజలు తరలిరావాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు బాణాల వెంకటేశ్వర్లు, మద్దెల రవి, మాజీ ఎంపిపి కట్టా కృష్ణార్జున్‌రావు, వనమా విశ్వేశ్వరరావు, మున్సిపాల్ మాజీ వైస్ చైర్మన్ ముళ్ళపాటి సీతారాములు, డాక్టర్ కాపా మురళీకృష్ణ, మాదినేని ప్రసాద్, కామినేని శ్రీనివాసరావు, మెదరమెట్ల రాము, దొంతెబోయిన వెంకటేశ్వర్లు, మేదరమెట్ల శ్రీనివాసరావు, బట్టా భద్రయ్య, అయినాల కనకరత్నం, దొంతెబోయిన శ్రీనివాసరావు, పుప్పాల అనంతరామయ్య, ఆదూరి ప్రేమ్, మిట్టపల్లి సత్యంబాబు, తన్నీరు కిషోర్, నూకల ప్రసాద్, కారుకొండ బోస్, ఏదునూరి శ్రీనివాసరావు, అప్పం సురేష్, దొంతబోయిన వెంకటనారాయణ, మాదినేని లక్ష్మణ్, బుచ్చిరామారావు, పోశం శ్యామ్, ఓంకార్ పాల్గొన్నారు.

# మట్టి తోలకాలపై టాస్క్ ఫోర్స్ పంజా

**అక్రమంగా మట్టి తరలిస్తున్న టిప్పర్‌ని పట్టుకున్న టాస్క్ ఫోర్స్**





**ప్రజాపక్షం/సత్తుపల్లి:** అక్రమ మట్టి తోలకాలపై జిల్లా టాస్క్ ఫోర్స్ పోలీస్‌లు పంజా విసిరారు. మంగళవారం మండలంలో పర్యటించిన టాస్క్ ఫోర్స్ బృందం ఎన్టీఆర్ కాలనీ సమీపంలో అక్రమం మట్టి తోలకాలు సాగిస్తున్న టిప్పర్ ను పట్టుకుని స్థానిక స్టేషన్ కి తరలించారు. అక్రమ మట్టి తోలకాలకు అడ్డుకట్ట ఎప్పుడూ..? అనే శీర్షికతో ఈనెల 12న ప్రజాపక్షం తెలుగు దినపత్రికలో ప్రత్యేక కథనం ప్రచురితమైన విషయం పాఠకులకు విధితమే. అక్రమ మట్టి తోలకాలపై పత్రికల్లో వరుస కథనాల నేపథ్యంలో టాస్క్ ఫోర్స్ పోలీస్‌లు మట్టి తోలకాలు సాగిస్తున్న టిప్పర్ ను పట్టుకోవటంతో మిగిలిన వారు వాహనాలను దాచిపెట్టినట్లు తెలిసింది. అక్రమ మట్టి తోలకాలపై పోలీస్, రవాణా, టాస్క్ ఫోర్స్ బృందాలు అడపా, దడపా దాడులు చేసి పట్టుకుంటున్నా మైనింగ్ శాఖ మాత్రం ఆ వైపు కన్నెత్తి చూడకపోవటం పలు అనుమానాలకు తావిస్తుంది. సత్తుపల్లి, వేంసూరు మండలాల్లో రాత్రి, పగలు తేడా లేకుండా అక్రమ మట్టి తోలకాలు యద్దేచ్ఛగా సాగుతున్నాయని, వాహనాల రయ్, రయ్ సబ్దాలకు రాత్రిళ్ళు నిద్ర ఉండటం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మైనింగ్ శాఖాదికారులు అక్రమ మట్టి తోలకాలు సాగిస్తున్న వారి ఆటకట్టించాలని,లేని పక్షంలో జిల్లా కలెక్టర్ ని కలిసి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేస్తామని ప్రజా సంఘాల నాయకులు తెలుపుతున్నారు.టాస్క్ ఫోర్స్ పోలీసులు సైతం రోడ్లపై తిరుగుతున్న టిప్పర్లను కాకుండా అక్రమంగా మట్టి తవ్వుతున్న ప్రదేశం వద్దకు వెళ్లి భారీ మిషన్లను పట్టుకుని స్టేషన్ కు తరలించి కేసులు నమోదు చేయాలని కోరుతున్నారు.

## మొదటిస్థానంలో మోరంపల్లి బంజర్ పంచాయతీ




**ప్రజాపక్షం/బూర్గంపాడు :** ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పల్లె పాలన అభివృద్ధి 202223 నాటికి దేశంలో గ్రామ పంచాయితీల సాధించిన అభివృద్ధి ఆధారం కేంద్ర పంచాయితీ రాజ్ శాఖ ఇటీవల పంచాయితీ పురోగతి సూచిక విషయాలను వెల్లడించింది. రాష్ట్రంలో కామారెడ్డి జిల్లాలోని బుర్నాపూర్ పంచాయితీకి 84.69 మార్కులతో మొదటి స్థానంలో నిలవగా, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని మోరంపల్లి బంజర్ గ్రామ పంచాయితీ జిల్లాలోనే మొదటి స్థానంలో నిలిచి ముందు వరుసలో నిలిచింది. ఆ పంచాయితీలో పని తీరుపూ మండల ప్రజలు ప్రశంసలు కురిపిస్తున్నారు. ఆరోగ్యం, చిన్నారులకు అనుకూలమైన సౌకర్యాలు కల్పన, త్రాగునీరు, పారిశుద్ధం, పచ్చదనం, మౌలిక వసతిలో స్వాలంబన, సామాజిక భద్రత, సుపరిపాలన మహిళలకు అనుకూలమైన విధానాలు, అనే తొమ్మిది కొలమానాల ఆధారంగా పంచాయితీలలో పనితీరును కొలమానం చేశారు. కేంద్ర ప్రభుత్వం పంచాయితీ రాజు అడ్వాన్స్‌మెంట్ ఇండెక్స్ పేరుతో పోర్టల్ ఏర్పాటు చేసి దరఖాస్తులు ఆహ్వానించి, పంచాయితీ కార్యదర్శుల వివరాలను పోర్టల్‌లో పొందుపరిచింది. మండల, జిల్లా స్థాయి కమిటీలు బాగా పని చేసిన పంచాయితీలను గుర్తించి రాష్ట్ర స్థాయికి పంపిస్తారు. అక్కడ మరో సారి పరిశీలించి జాతీయ స్థాయికి ప్రతిపాదించారు. ఈ ఆధారంగా జాతీయ స్థాయి పంచాయితీరాజ్ శాఖ ర్యాంకులను ప్రకటించారు. బంజర్ పంచాయితీలో 9 అంశాలపై జరిగిన ప్రగతికి గుర్తింపు రావడం చాలా ఆనందంగా ఉందని గ్రామ పంచాయితీ ప్రత్యేక అధికారి ఆర్ శంకర్, పంచాయితీ కార్యదర్శి భవాని, గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

**పంచాయితీ ప్రజల సహకారంతో అభివృద్ధి : భవాని, గ్రామ పంచాయితీ కార్యదర్శి**



మోరంపల్లిబంజర్ గ్రామ పంచాయితీలో 9 అంశాలను తూచా తప్పకుండా పాటించి, ప్రజలకు అవగాహన కల్పించడం జరిగిందని, పంచాయితీ ప్రజల సహకారంతో అభివృద్ధి సాధ్యమైందని గ్రామ పంచాయితీ కార్యదర్శి భవాని అన్నారు. పారిశుధ్య కార్మికుల కృషి, పంచాయితీ ప్రజల సహకారంతోనే ఈ గుర్తింపు లభించిందన్నారు. తాను పని చేసంతున్న గ్రామ పంచాయితీకి జిల్లాలోనే మొదటి స్థానం జాతీయ స్థాయిలో రావడం సంతోషంగా ఉందని, త్వరలో రాష్ట్ర స్థాయిలో సైతం మొదటి స్థానంలో నిలిచేందుకు కృషి చేస్తానని అన్నారు.

# చద్దన్నంతో అనేక లాభాలు..!

**చద్దన్నంపై ప్రజాపక్షం ప్రత్యేక కథనం**




**ప్రజాపక్షం/మణుగూరు:** పెద్దల మాట చద్దన్నం మూట సామెత బా గా పాపులర్.. చద్దన్నంతో ఎన్ని లాభాలు ఉన్నాయో చూద్దాం.. టిఫిన్ అనగానే మనకు గుర్తొచ్చేది ఇడ్లీ, దోశ, చపాతి కానీ రాత్రి వండిన అన్నాన్ని తెల్లవారి ఆవకాయ, పెరుగు, కలుపుకుని పచ్చి మిర్చి, ఉల్లిగడ్డ నంజుకుని తింటే రుచికి రుచి ఆరోగ్యానికి ఆరోగ్యం. సద్దన్నం పులవడం ఒక రాత్రి ఉండడం వల్ల పెరిగే పోషకలు, ఉదాహరణకు 50 గ్రాముల అన్నంను తీసుకొని రాత్రి పుల్లపెట్టినట్లయితే 1.6 మిల్లీగ్రాములు ఉన్న ఐరన్ 35 మిల్లీగ్రాములుగా పెరుగుతుంది. అలాగే పొటాషియం మరియు క్యాల్షియంలు కూడా భారీ మొత్తంలో పెరుగుతాయి. రాత్రి పూట మిగిలిన అన్నంలో కొంచెం పాలు పచ్చి ఉల్లిపాయ ముక్కలు, అల్లం, కరివేపాకు, జీలకర్ర వేసి కలిపి దానిలో కొంచెం పెరుగు వేసి పొద్దునే తింటే అనారోగ్య సమస్యలు అన్ని తొలగిపోతాయి ఎముకలకు బలం కూడా చేకూరుతుంది. వేడి ఎక్కువగా ఉన్నవారు చద్దన్నంలో పెరుగు, పచ్చిమిర్చి, ఉల్లిపాయ వేసుకొని తింటే వేడి తగ్గుతుంది. చద్దన్నం తింటే మంచిదే కదా అని మధ్యాహ్నం, సాయంత్రం తిందామంటే కుదరదు. తెల్లారిన తర్వాత కూడా ఎక్కువ సమయం అలాగే ఉంచేస్తే పాడైపోయే అవకాశం ఉంది అందుకే ఉదయం 9:00 గంటల్లోపే తినేయాలి. పేగుల్లో ఉండే అనారోగ్య సమస్యలకు సైతం ఈ చద్దన్నం తగ్గిస్తుంది. పలు చర్మ వ్యాధుల నుండి చద్దన్నం కాపాడుతుంది.

## సింగరేణి ఓబి కాంట్రాక్ట్ కార్మికుల నూతన కమిటీ ఎన్నిక



**ప్రజాపక్షం/మణుగూరు:** సింగరేణి కాంట్రాక్టు కార్మికుల నూతన కమిటీని పినపాక నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బిఆర్ఎస్ అధ్యక్షులు రేగా కాంతారావు అధ్యక్షతన నూతన కమిటీని ఎన్నుకొన్నారు. సింగరేణి ఏరియాలో బిఆర్ఎస్ ఓబీ కాంట్రాక్ట్ కార్మికుల సంక్షేమాలపై బిఆర్ఎస్ కార్మికుల పక్షాన ఉంటూ వారి బాగోగులు చూసుకోవడంలో బిఆర్ఎస్ ఓబి కాంట్రాక్ట్ యూనియన్ ఎప్పుడు అండగా ఉంటుందని అన్నారు. నూతన కమిటీ అధ్యక్షులుగా గడదేసి మధుబాబు, సెక్రటరీగా మా దేవి అశోక్, వైస్ ప్రెసిడెంట్ గా జాల నాగరాజు, కోశాధికారిగా ఎర్రోజు రాము ను మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో మణుగూరు మండల బిఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, ఇంకా నూతన కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## దేవరకొండ కిరణ్‌కి దళిత రత్న అవార్డు



**ప్రజాపక్షం/జూలూరుపాడు:** డాక్టర్ బి ఆర్అంబేద్కర్ 134 వ జయంతి సందర్భంగా హైదరాబాద్ రవీంద్ర భారతిలో జయంతి ఉత్సవాల సందర్భంగా దళిత రత్న అవార్డులను ప్రదానం చేసిన రాష్ట్ర ప్రభుత్వం తరపున ఉత్సవ కమిటీ కన్వీనర్ చేతుల మీదుగా దళిత రత్న అవార్డు గ్రహీత దేవరకొండ కిరణ్ మాదిగ కి ప్రధానం చేశారు. నాకు అవార్డు రావడానికి సహకరించిన ఉత్సవ కమిటీ సలహాదా జెన్ను కనకరాజు మాదిగ, డాక్టర్ కొరిపల్లి శ్రీనివాస్, మాదిగ తెలంగాణ మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర అధ్యక్షులుకి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దళిత రత్న అవార్డు గ్రహీత దేవరకొండ మాదిగ మాట్లాడుతూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండల వెంగన్నపాలెం గ్రామంలో మధ్యతరగతి కుటుంబంలో జన్మించిన తల్లిదండ్రులు దేవరకొండ సీతమ్మ, జానకిరాములుకు 3వ సంతానం వారి విద్యా, హరహత, పిజీ, గ్రాడ్యుయేషన్ పూర్తి జెసి మాదిగ దండోరా ఉద్య ఉద్యమంలో, గ్రామపక్ష భావాలు కలిగిన వామపక్ష భావాలు కలిగిన నేను దళితుల అభ్యున్నతకై నిరంతరం పోరాటం చేసిన నాకు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి రోజున దళిత రత్న అవార్డు రావడం నాకు ఎంతో సంతోషంగా ఉన్నదని, నాపై నమ్మకంతో ఈ అవార్డు ను నాకు రావడానికి సహకరించిన తెలంగాణ మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర అధ్యక్షులు కొరిపల్లి శ్రీనివాస్, మాదిగ లకి ధన్యవాదాలు తెలిపారు.

## రైతులకు మేలు చేసేందుకే భూ భారతి అమలు

**ప్రజాపక్షం/జూలూరుపాడు:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం యావత్తు రైతాంగానికి మేలు చేసేందుకే భూ భారతి పథకాన్ని అమలు చేస్తోందని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు లేళ్ల వెంకట్ రెడ్డి స్పష్టం చేశారు. గత ప్రభుత్వం ధరణి పేరుతో రైతుల నడ్డివిరిచిందని, అసంబద్ధత పోర్టల్ తో రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేసిందన్నారు. రైతుల సంక్షేమమే లక్ష్యంగా పని చేసే కాంగ్రెస్ ప్రభుత్వం, రెవెన్యూ శాఖ మంత్రి వర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో భూ భారతి పథకాన్ని ప్రారంభించి, రైతుల పక్షాన నిలిచి.. తెలంగాణ చరిత్రలో ఒక మైలు రాయిని సృష్టించిందన్నారు.. ఎంతో కష్టపడి తయారు చేసిన భూ భారతి ని సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి వర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరణ చేసిన "భూ భారతి।। చరిత్ర తిరగరాయాలని, భూ భారతి ఉన్నంతకాలం రైతులకు మేలు చేసే విధంగా చరిత్రలో నిలిచిపోవాలని మనస్పూర్తిగా కొరుక్కుంటూ యావత్తు తెలంగాణ రైతుల పక్షాన, కాంగ్రెస్ పార్టీ పక్షాన సీఎం, పొంగులేటిలకు మనస్పూర్తిగా ధన్యవాదాలు, అభినందనలు తెలిపారు.

## డాక్టర్ మద్దిశెట్టి వెంకటేశ్వరరావుకి బంగారు కామదేను అవార్డు




**ప్రజాపక్షం/జూలూరుపాడు:** హైదరాబాద్‌లోని రవీంద్ర భారతి నందు జిసిఎస్ వల్లూరి ఫౌండేషన్, విజన్ నేషనల్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ వారి ఆధ్వర్యంలో ఉగాది, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా జరిగిన సన్మాన సభలో మద్దిశెట్టి వెంకటేశ్వరరావుకి ఘన సన్మానం జరిగింది. సన్మాన సభలో సత్కరించిన వారిలో జీసస్ వల్లూరి ఫౌండేషన్ చైర్మన్ విఆర్ శ్రీనివాస్ రాజు, ప్రముఖ సంఖ్యా శాస్త్రవేత్త దైవజ్ఞ శర్మ, తెలంగాణ ఫిలిం క్లబ్ చైర్మన్ పటాని రామకృష్ణ గౌడ్, ప్రొడ్యూసర్ అండ్ సినీ నటులు రామిశెట్టి తిరుపతిరావు, ప్రముఖ వ్యాఖ్యాత శ్రీధర్ ఆచార్య, మహిళా అధ్యక్షురాలు కృష్ణవేణి, బండ ప్రకాష్, శాసనసభ్యులు ప్రత్యేక ముఖ్య అతిథి గౌరవ గద్దర్ అన్న ముద్దుబిడ్డ డాక్టర్ వెన్నెల, సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్ గవర్నమెంట్ ఆఫ్ తెలంగాణ సార్ ని మెమొంటో బంగారు కామధేను శాలువాతో ఘనంగా సన్మానించారు.

## యాసంగి ప్రభుత్వ వరిధాన్యం కొనుగోలు కేంద్రాల సందర్శన



**ప్రజాపక్షం/మణుగూరు:** మండల పరిధిలోని చిన్నరావిగూడెం గ్రామంలో ప్రాథమిక సహకార సంఘం, మణుగూరు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన యాసంగి ప్రభుత్వ వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మణుగూరు మండల వ్యవసాయ విస్తరణ అధికారి కొమరం లక్ష్మణరావు సందర్శించారు. రైతులు వరిపంట కోత అనంతరం 17 శాతం తేమ వచ్చేలా ఆరబెట్టాలని, ఆరిన తరువాత చెత్తాలు 1శాతం , పక్వంకాని గింజలు 1శాతం, ఇతర రకం గింజలు 5 శాతం మించకుండా ఉండేలా తూర్పార పట్టి శుభ్రం చేసి కొనుగోలు కేంద్రానికి తెచ్చి అమ్ముకోవాలని, వర్షానికి వారి ధాన్యం తడవకుండా టార్పాలిన్ పట్టాలు సిద్ధంగా ఉంచుకోవాలని రైతులకు సూచనలు చేశారు. అనంతరం ప్రాథమిక సహకార సంఘం, మణుగూరు వారిని కొనుగోలు కేంద్రంలో రైతులకు మంచి నీరు, నీడ కోసం టెంట్, ధాన్యం పై కప్పడానికి టార్పాలిన్ పట్టాలు సిద్ధంగా ఉంచుకోవాలని సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ రైతులు బత్తుల శ్రీనివాసరావు తదితర రైతులు పాల్గొన్నారు.

# నీటి ఎద్దడి లేకుండా చర్యలు



**-నీటి వినియోగంపై అవగాహన కార్యక్రమాలు**
**-కమిషనర్ అభిషేక్ అగస్త్య**

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగర పాలక సంస్థ పరిధిలో వేసవిలో నీటి ఎద్దడి లేకుండా తగు చర్యలు తీసుకుంటున్నట్లు ఖమ్మం మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య తెలిపారు. నీటి సరఫరాపై మంగళవారం ఖమ్మం కార్పోరేషన్ కార్యాలయంలో కమిషనర్ అభిషేక్ అగస్త్య ఇంజనీరింగ్ విభాగ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఖమ్మం నగరంలో త్రాగునీటి సరఫరాకు ఇబ్బందులు రాకుండా ఉండేందుకు అవసరమైన ముందస్తు చర్యలు, జలాశయాల నీటిమట్టం, పంపింగ్ స్టేషన్ల పనితీరు, లీకేజీ నివారణ తదితర అంశాలపై చర్చించారు. అధికారులకు కమిషనర్ పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నీటి వృథాను నివారించేందుకు తగు చర్యలు తీసుకోవాలన్నారు. నిబంధనల మేరకు రేషన్ చేసిన విధంగా నీటి సరఫరాను చేపట్టాలన్నారు. అత్యవసర సమయంలో ట్యాంకర్ల ద్వారా నీటి పంపిణీకి ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. పాలేరు రిజర్వాయర్‌లో 90 రోజులకు సరిపడ నీటి నిల్వలు ఉన్నాయన్నారు. అత్యవసర పరిస్థితుల్లో ఖమ్మం నగరంలో ఉపయోగించుకోవడం కోసం 548 హ్యాండ్ బోర్స్, 76 పవర్ బోర్స్, 14 ట్యాంకర్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అన్ని డివిజన్లకు నీటి సరఫరా అందేలా కార్యాచరణ చేపట్టి నీటి పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ప్రజల్లో నీటి వినియోగంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులకు కమిషనర్ సూచించారు. అనంతరం ఆర్వో, వార్డు ఆఫీసర్లతో ఇందిరమ్మ ఇండ్ల ఎల్1 వెరిఫికేషన్ స్టేటస్ గురించి కమిషనర్ చర్చించారు.

# అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

**-ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నందుకు ధన్యవాదాలు**
**-కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ల**






**ప్రజాపక్షం/ఖమ్మం టౌన్ :** అన్ని వర్గాల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందాలనేదే ప్రభుత్వ సంకల్పమని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ తెలిపారు. మంగళవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డి భవన్‌లో ఇచ్చిన మాట ప్రకారం ప్రతి ఒక్క హామీని నెరవేరుస్తూ కాంగ్రెస్ అంటేనే ప్రజా ప్రభుత్వమని నిరూపిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర మంత్రి మండలి సభ్యులకు ధన్యవాదాలు తెలుపుతూ వారి చిత్ర పటాలకు పాలాభిషేకం నిర్వహించి బాణాసంచా కాల్చి మిఠాయిలు పంచి సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, ఎస్సి సెల్ జిల్లా అధ్యక్షులు బొడ్డు బొందయ్య లు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా పేరుకుపోయిన ఎస్సి వర్గీకరణ, ధరణి సమస్యలను కాంగ్రెస్ ప్రభుత్వం చెవేళ్ల డిక్లరేషన్‌లో ఇచ్చిన మాట ప్రకారం అంబేద్కర్ జయంతి రోజున జీవో విడుదల చేసిందన్నారు. మాదిగ ఉపకులాలకు, రైతులకు న్యాయం చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనన్నారు. ఉచిత బస్సు ప్రయాణం నుంచి సాగుతున్న పాలన రిజర్వేషన్ అమలు వరకు వచ్చిందన్నారు. ఆర్థికపరంగా సమస్యలు ఉన్న వాటిని అధిగమిస్తూ అభివృద్ధి, సంక్షేమాన్ని సమపాళ్లలో అందిస్తూ ప్రజల మన్ననలు ప్రభుత్వం పొందుతుందన్నారు. ఎస్సి వర్గీకరణ ద్వారా మూడు దశాబ్దాల పోరాట ఆకాంక్షలను నెరవేర్చి విద్య, ఉద్యోగ, స్థానిక రాజకీయాల్లో బడుగు,బలహీన వర్గాలకు 42 శాతం రిజర్వేషన్ల కల్పనకు చట్టరూపం ఇవ్వడం జరిగిందన్నారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల ద్వారా పేద పిల్లలకు నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం సంకల్పిస్తుందన్నారు. పేద వారి ఆకలిని తీర్చేందుకు సన్నబియ్యం పథకానికి శ్రీకారం చుట్టిందన్నారు. ధరణి లోపాలను సవరిస్తూ భూ భారతి చట్టానికి శ్రీకారం చుట్టిందన్నారు. ఇటువంటి మంచి కార్యక్రమాలను చూసి ఓర్వలేకే బిజెపి, బిఆర్ఎస్ పార్టీలు అసత్య ఆరోపణలు చేస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐసిసి సేవా దళ్ కో ఆర్డినేటర్ చోటాబాబా, టిపిసిసి సభ్యులు పుచ్చకాయల వీరభద్రం, జిల్లా అనుబంధ సంఘాల అధ్యక్షులు కొత్తా సీతారాములు, దొబ్బల సౌజన్య, సయ్యద్ గౌస్, ముజాహిద్ హుస్సేన్,మొక్కా శేఖర్ గౌడ్, గజ్జెల్లి వెంకన్న, రషీద్, ముక్రం, యర్రం బాలగంగాధర్ తిలక్, కార్పొరేటర్లు సైదులు నాయక్, రాపర్తి శరత్, కన్నం వైష్ణవి ప్రసన్నకృష్ణ, చామకూరి వెంకటనారాయణ, పలువురు నాయకులు పాల్గొన్నారు.

# ధంసలాపురం సిపిఐ శాఖ ఎన్నిక



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగర పాలక సంస్థ పరిధిలోని 16వ డివిజన్ ధంసలాపురం సిపిఐ శాఖ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మంగళవారం ధంసలాపురంలోని బిసి కాలనీలో సిపిఐ శాఖ మహాసభ యాతం భూపాల్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సభలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పగడాల మల్లేష్ పాల్గొని మాట్లాడుతూ ఈ ప్రాంతాభివృద్ధికి సిపిఐ ఎనలేని కృషి చేసిందన్నారు. ఈ ప్రాంతంలో పేదలకు ఇండ్లు ఇప్పించిన ఘనత సిపిఐదేనన్నారు. సమస్యల పరిష్కారానికి సిపిఐ నిరంతరం పోరాడుతుందని ఆయన తెలిపారు. నూతనంగా ఏర్పడిన కమిటీ పార్టీ అభివృద్ధితో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. 16వ డివిజన్ కార్యదర్శిగా యాతం భూపాల్‌రెడ్డి, సహాయ కార్యదర్శులుగా వెంపటి నాగేశ్వరరావు, ఖాదర్‌బాబాతో పాటు 11 మంది కౌన్సిల్ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మాడుగుల నాగేశ్వరరావు, మాలకొండయ్య, 22వ డివిజన్ కార్యదర్శి కట్ల నర్సింహారావు, వన్‌టౌన్ ఏరియా మహిళా సమాఖ్య అధ్యక్షులు నారపోగు నాగమణి, సీనియర్ నాయకులు రోశయ్య, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రిని కలిసిన ఎమ్మెల్యే రాగమయి



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని సత్తుపల్లి శాసన సభ్యురాలు డా.మట్టా రాగమయి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు డా.మట్టా దయానంద్ విజయ్ కుమార్ లు మంగళవారం ఆయన నివాసంలో సీఎం రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. అనంతరం మండల పరిధిలోని కిష్టారం గ్రామంలో సైలో బంకర్ నుండి వెలువడుతున్న కాలుష్యంతో ఇబ్బందులు పడుతున్న ప్రజల సమస్యల వివరించి వారికి న్యాయం చేయాలని కోరారు. అదే విధంగా డి.ఎం.ఎఫ్.టి నిధులు గురించి సీఎంతో చర్చించారు. సానుకూలంగా స్పందించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి త్వరలోనే సమస్యలకు పరిష్కారం చూపుతానన్నట్లు ఎం.ఎల్.ఏ తెలిపారు.

## పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి



**ప్రజాపక్షం/ ఖమ్మం :** అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అం దించి ఆదుకోవాలని బిజెపి కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు కొండపల్లి శ్రీధర్ రెడ్డి, బిజెపి పార్లమెంట్ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఎర్రుపాలెం మండలంలో పర్యటించిన అకాల వర్షాలతో దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు పంట నష్టపోయి వారంరోజులు గడుస్తున్నా ఏ ఒక్క వ్యవసాయ అధికారి కనీసం నష్టం నమోదు చేసేందుకు కూడా లేదన్నారు. వ్యవసాయ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం పట్ల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. గావ్ చలో బస్తీ చలో కార్యక్రమంలో భాగంగా రేమిడిచర్ల గ్రామంలో జెండా ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నరేంద్రమోడీ నాయకత్వంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని అన్నారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో బిజెపి పార్లమెంటరీ అభ్యర్థి తాండ్ర వినోధర్‌రావు, బిజెపి మాజీ జిల్లా అధ్యక్షులు గల్లా సత్యనారాయణ, జిల్లా మోర్చా అధ్యక్షులు కిరణ్, మధిర అసెంబ్లీ కన్వీనర్ ఏలూరి నాగేశ్వరరావు, మండల అధ్యక్షులు నూతక్కి నర్సింహారావు, బిజెపి జిల్లా కార్యదర్శి చిలువేరు సాంబశివరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## శ్రీకాంత్ మృతి ప్రజా ఉద్యమాలకు తీరని లోటు

**ప్రజాపక్షం/ ఖమ్మం:** సిపిఎం పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు ఎర్ర శ్రీకాంత్ మృతి ప్రజా ఉద్యమాలకు, పార్టీకి తీరని లోటని జిల్లా కమిటీ సభ్యులు దివ్వెల వీరయ్య అన్నారు. మండల కేంద్రంలోని రామిశెట్టి పుల్లయ్య భవనంలో మంగళవారం మండల కమిటీ ఆధ్వర్యంలో ఎర్ర శ్రీకాంత్ సంతాప సభను మండల కార్యదర్శి మద్దాల ప్రభాకర్‌రావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ ఎర్ర శ్రీకాంత్ మృతి చెందటం చాలా బాధాకరమని, ఆయన జీవితం పార్టీకి అంకితం చేసి చివరి శ్వాస వరకు ఎర్రజెండా నీడనే ఉన్నారని ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు గామాసు జోగయ్య, దూదిగం బసవయ్య, షేక్.నాగుల్‌మీరా, సుబ్బారెడ్డి, మహేష్, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

## సెక్యూరిటీ సిబ్బంది తనిఖీలు



**ప్రజాపక్షం/కొత్త గూడెం టౌన్ :** మంగళవారం కొత్త గూడెం సింగరేణి సెక్యూరిటీ జనరల్ మేనేజర్ చందా లక్ష్మినారాయణ ఆదేశాలతో లక్ష్మి దేవి పల్లి మండలంలోని లోతు వాగు ప్రాంతంలోని స్క్రాప్ దుకాణాలలో సింగరేణి సెక్యూరిటీ సిబ్బంది తనిఖీలు నిర్వహించారు. అనంతరం దుకాణాదారుల తో సెక్యూరిటీ అధికారులు మాట్లాడుతూ, సింగరేణి సంస్థ కు చెందిన ఇనుప సామానులు ఎవరి వద్ద నుండీ కొనుగోలు చేసిన చట్టం ప్రకారం శిక్ష కు గురి అవు తారని దుకాణా దారులకు చెప్పారు. ఈ కార్యక్రమంలో నారాయణ రెడ్డి, బాస్కరరావు రెడ్డి, శివ కుమార్, ఉదయ బాస్కరరావు, తదితర సిబ్బంది పాల్గొన్నారు.

## సెక్యూరిటీ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్



**ప్రజాపక్షం/కొత్త గూడెం టౌన్** చందా లక్ష్మినారాయణ, జనరల్ మేనేజర్ అధ్యక్షతన అన్నీ ఏరియాల సెక్యూరిటీ అధికారులతో యస్ పిసి పరిపాలన పరమైన అంశాలు, దొంగతనాల నివారణ, ఎండాకాలంలో సెక్యూరిటీ సిబ్బందికి కావలసిన సదుపాయాలు, ఏరియాలలో స్క్రాప్ తీసివేత, మ్యాన్ పవర్, కోల్డ్ ట్రాన్స్పోర్ట్ ట్రక్స్ మూమెంట్, ఖాళీ స్థలాలు ఎస్టేట్ వారి అనుబంధంతో గుర్తించి వాటిని సివిల్ డిపార్ట్మెంట్ సహాయంతో ఫన్సింగ్, కాంపౌండ్ వాల్ ఏర్పాటు చేయించి లా అండ్ ఆర్డరు సమస్యలు ఎదురైతే పోలీసు వారి సహాయముతో పరిష్కరించుకొని కంపెనీ కాలీ స్థలాలను సెక్యూరిటీ సహాయంతో కాపాడుకోవాలని తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమములో జె.వేణుమాధవ్, ఎస్వోటూ జియం సెక్యూరిటీ, కార్పోరేట్ ఏరియా సెక్యూరిటీ అధికారి, అన్ని ఏరియాల సెక్యూరిటీ అధికారులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ రజోత్సవ సభకు తరలి రండి

**-వినూత్నంగా ఆడపడుచులకు బొట్టుపెట్టి పిలుపులు**
**-ఎంపీ వద్దిరాజు, మాజీ ఎమ్మెల్యే బాణోత్ హరిప్రియ**







**ప్రజాపక్షం/ఖమ్మం :** సన్నాయి మేళం సప్పుళ్లు, బాజా భజంత్రీల మోతల నడుమ మహిళా నేతలు కుంకుమ పూలు, కుంకుమ, గంధం, వాయినాలు ఇవన్నీ పెళ్లి కార్యానికో అనుకుంటే పప్పులో కాలేసినట్టే.! ఈ హడావిడి ఎక్కడో తెలుసుకోవాలంటే.. ఈ వార్త పూర్తిగా చదవాల్సిందే..! ఈనెల 27న వరంగల్‌లో జరిగే భారత రాష్ట్ర సమితి (బిఆర్ఎస్) రజతోత్సవ సభకు తరలి రావాలని వినూత్న రీతిలో ప్రచారం నిర్వహించారు. మేళ తాళాల నడుమ పార్టీ ముఖ్య నాయకులు ఇళ్లకు వెళ్లి బొట్టుపెట్టి వరంగల్ సభకు ఆహ్వానించారు. రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీ ఎమ్మెల్యే బాణోత్ హరి ప్రియ తెలంగాణ ఉద్యమకారుడు దిండిగాల రాజేందర్ అతిథులుగా హాజరై ఈకార్యక్రమంలో బీఆర్ఎస్ కార్యకర్తలు, మహిళా నేతలు, కౌన్సిలర్లు వెంట నడిచారు. ఇల్లెందు మున్సిపాలిటీ 7వవార్డులోని నెం2బ స్తీలో ప్రచార కార్యక్రమం నిర్వహించారు. బీఆర్ఎస్ క్రియాశీల కార్యకర్తల కుటుంబాల్లో ముఖ్యులైన బజారు సత్యనారాయణ, ఎం.ఎ.రవూఫ్, చాగర్ల సరళ, సామల రవితేజ ఇళ్లకు వెళ్లి బొట్టు పెట్టి కుటుంబసభ్యులందరినీ వరంగల్‌లో జరిగే రజతోత్సవ సభకు హాజరుకావాలని ఎంపీ వద్దిరరాజు రవిచంద్ర కోరారు. ఒక ప్రాంతీయ పార్టీ పాతికేళ్లుగా క్రియాశీలకంగా ప్రజలకోసం అంకితమై పనిచేయడం చాలా అరుదన్నారు. తెలుగు రాష్ట్రాల్లో తెలుగుదేశం పార్టీ తర్వాత అంతటి ఘనత బీఆర్ఎస్‌కే దక్కిందన్నారు. అందుకే బీఆర్ఎస్ పాతికేళ్ల సంబురం పండుగలా నిర్వహిస్తామని ఎంపీ వద్దిరాజు రవిచంద్ర తెలిపారు. ఈ సభకు తాము ఊహించిన దానికంటే ఎక్కువమంది కార్యకర్తలు తరలివస్తున్నారని, సభను విజయవంతం చేసేందుకు ప్రతీ కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు, మహబాద్ మాజీ జడ్పీటీసీ ఛైర్మన్ బిందు, మాజీ జడ్పీటీసి సంజీవ్, లక్కినేని సురేందర్, సిలివేరు సత్యనారాయణ, శీలం రమేశ్, నెమలి ధనలక్ష్మి, లలిత్‌పాసీ, మాజీ కౌన్సిలర్లు, మాజీ సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

# ఇల్లెందు తపాల కార్యాలయంలో విద్యుత్, జనరేటర్ లేక ఆన్‌లైన్ అవస్థలు



**ప్రజాపక్షం/ఖమ్మం :** ఇల్లెందు తపాలకార్యాలయంలో దశాబ్దకాలంగా జనరేటర్ మరమ్మతులు, విద్యుత్ లేక ఆన్‌లైన్ సేవలు నిలుస్తుండటంతో పింఛనర్లు తీవ్ర అస్థలు పడుతున్నారని, తక్షణమే జనరేటర్ మరమ్మతులు చేయించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అబ్దుల్ నభీ డిమాండ్ చేశారు. మంగళవారం పాతబస్టాండ్‌లోని ఉదయం 9గంటల నుంచి 12:30గంటల వరకు విద్యులేకపోవడంతో తపాలాబ్యాంకు ఖాతాదారులు ఎండతీవ్రతకు, ఉక్కపోతకు మహిళలు పింఛనర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని, విషయం పరిశీలించిన సీఐటీయూ జిల్లా నాయకుడు అబ్దుల్‌నభీ మాట్లాడారు. ఏళ్లతరబడి జనరేటర్ మరమ్మతులకు గురైనప్పటికీ పట్టించుకోలేదని, ఈ విషయమై విద్యుత్ అధికారులతో, పోస్ట్‌మాస్టర్‌లతో మాట్లాడిన అనంతరం కరెంట్‌రాగా ఒంటి గంటకు ముగియాల్సిన పోస్టల్ బ్యాంకు సిబ్బంది ఎక్కువమంది ఉండటంతో తర్వాత కూడా సేవలందించినట్లు తెలిపారు.

# రాసురి శంకర్ మరణం కాంట్రాక్టు కార్మికులకు తీరని లోటు



**ప్రజాపక్షం/కొత్త గూడెం టౌన్ :** సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలపై నిరంతరం కృషి చేస్తున్న క్రమంలో ఐక్య ఉద్యమాలకు సిఐటియు చేస్తున్న ఐక్య కార్యాచరణ కార్యక్రమాలలో రాసూరి శంకర్ యొక్క పాత్ర చెప్పుకోదగినదని సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శిబి మధు అన్నారు. రా సూరి అకాల మరణం పట్ల వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి సంతాపం తెలిపారు. రాసూరి శంకర్ భౌతిక గాయానికి పూలమాలవేసి నివాళులర్పించారు. హనుమాన్ బస్తి తన నివాసం నుండి అంతిమ యాత్ర లో పాల్గొనారు. ఈ కార్యక్రమం లో సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘం కొత్తగూడెం బ్రాంచ్ నాయకులు భూక్యా రమేష్, కాంటాక్ట్ కార్మికులు, పాల్గొన్నారు.

# గులాబీ దండు కదం తొక్కాలి.. కాంగ్రెస్ గుండెల్లో రైళ్లు పరుగెత్తాలి...

**ఎంపీ వద్దిరాజు రవిచంద్ర**



**ప్రజాపక్షం/ఇల్లెందు:** ఈనెల27న వరంగల్‌లో జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు ఇల్లెందు నియోజకవర్గం నుంచి గులాబీ దండు కదం తొక్కాలి, కాంగ్రెస్ గుండెల్లో రైళ్లు పరుగెత్తాలని రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర పిలుపునిచ్చారు. మాజీ ఎమ్మెల్యే బాణోత్ హరిప్రియ నాయక్ అధ్యక్షతన మంగళవారం ఏర్పాటైన నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశంలో హాజరై మాట్లాడారు. వరంగల్‌లో దాదాపు 10లక్షల మందితో జరిగే రజతోత్సవ సభలో బీఆర్ఎస్ నేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఏం మాట్లాడుతారోనని తెలంగాణ ప్రజలు ఎదురుచూస్తున్నారని, ఏడాదిన్నర కాంగ్రెస్ పాలనలో ప్రజలు విసిగి, వేసారి పోయారని ఆరోపించారు. ఆచరణలో సాధ్యంకాని హామీలిచ్చి అధికారంలోకి వచ్చి అమలుచేయలేక చేతులెత్తేశారని విమర్శించారు. కేసీఆర్‌ను దూరం చేసుకుని ప్రజలు తప్పుపని చేశామని ప్రశ్చాత్తాప్పడుతున్నారని తెలిపారు. కేసీఆర్ ఆనవాళ్లు చెరిపేద్దామని భ్రమ పడుతున్న ముఖ్యమంత్రి తాను కూర్చున్న కుర్చీ కేసీఆర్ భిక్షే అని ఎద్దేవా చేశారు. అనంతరం భద్రాద్రి కొ్తగూడెం జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు వరంగల్ సభకు దిశానిర్దేశం చేశారు. సభకు హాజరయ్యే ముందు పార్టీ కార్యకర్తలు తమ తమ గ్రామాల్లో పార్టీ జెండాలను ఆవిష్కరించి బయలుదేరాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు దిండిగాల రాజేందర్, మహబాద్ జడ్పీ మాజీ ఛైర్మన్ ఆంగోత్ బింధు, డీసీసీబీ మాజీ డైరెక్టర్ లక్కినేని సురేందర్, సేవాలాల్ సేన రాష్ట్ర అధ్యక్షుడు సంజీవ్ నాయక్, వివిధ మండలాల పార్టీ బాధ్యులు శీలం రమేశ్, బొమ్మెర ప్రసాద్, తాతా గణేశ్, లక్ష్మణ్ నాయక్, పరుచూరి వెంకటేశ్వరరావు, టీబీజీకేఎస్ నాయకులు రంగనాథ్, జాఫర్ హుస్సేన్, జేకే శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



**ప్రజాపక్షం/ఖమ్మం :** తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణ సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సూచన మేరకు కూసుమంచి క్యాంపు కార్యాలయం ఇన్చార్జ్ రెడ్డి శ్రీనివాస్ రెడ్డి ప్రభుత్వం ద్వారా మంజూరైన చెక్కులను మంగళవారం కూసుమంచిలో గల క్యాంపు కార్యాలయంలో76 మంది లబ్ధిదారులకు గాను 25 లక్షల పదివేల రూపాయల చెక్కులను లబ్ధిదారులకు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులు తాజా మాజీ ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

# భూ భారతితో రైతుల సమస్యలు పరిష్కారం చూపాలి



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** తెలంగాణ ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన భూ భారతి చట్టం ద్వారా రైతుల సమస్యలను పరిష్కరించి ప్రభుత్వం కు మంచి పేరు తీసుకరావాలని కాంగ్రెస్ నాయకులు తహశీల్దార్ కు వినతి పత్రం అందించారు. మంగళవారం నూతనంగా బాధ్యతలు స్వీకరించిన స్థానిక తహశీల్దార్ వెంకటేశ్వర్లు ను మర్యాపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. కొత్త చట్టం పట్ల స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడారు. ప్రభుత్వం తీసుకొచ్చిన భూ భారతి చట్టం ఎంతో ప్రయోజనం చేకూరుతుందని పేర్కొన్నారు. రైతుల కు అందుబాటులో ఉంటూ చట్టం ను అమలు చేసి ప్రభుత్వ ప్రతిష్టను పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయుకులు జె గ్రిపోతుల అంజిని, రావెళ్ల కృష్ణారావు, బచ్చలకూరి నాగరాజు, బోయిన వేణు. యడవలి నాగరాజు కడియాల నరేష్, దోసపాటి శేఖర్. కటికోల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# రేవంత్‌రెడ్డి రైతులను మోసం చేస్తున్నారు..

**-మాజీ ఎమ్మెల్యే వెంకటవీరయ్య**



**ప్రజాపక్షం/కల్లూరు :** కేసిఆర్ రైతులకు అండగా నిలిస్తే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతులను మోసం చేస్తున్నారని మాజీ శాసన సభ్యులు, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సండ్ర వెంకటవీరయ్య ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం దగాకోరు ప్రభుత్వంగా మారిందని ఆయన ఆరోపించారు. మంగళవారం కల్లూరు మండలంలోని పుల్లయ్యబంజర, తల్లాడ మండలం గొల్లగూడెం గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వెంకటవీరయ్య మాట్లాడుతూ అకాల వర్షంతో తడిసి మొలకలు వచ్చిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయడంతో పాటు రూ. 20వేల పరిహారాన్ని అందించాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వ నిర్లక్ష్యం, ముందు చూపు లేకపోవడం కారణంగానే జిల్లాలో రైతులు తీవ్రంగా నష్టపోయారని వెంకటవీరయ్య ఆరోపించారు. ధాన్యం ఎగుమతికి బస్తాలు ఇవ్వకపోవడం, రవాణా సౌకర్యాలు లేకనే ఈ పరిస్థితి ఏర్పడిందన్నారు. పుల్లయ్యబంజర్ కొనుగోలు కేంద్రంలోనే లక్ష బస్తాల ధాన్యం వర్షానికి తడిసిపోయిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఒక ప్రత్యేకాధికారిని నియమించి ధాన్యాన్ని త్వరితగతిన తరలించాలన్నారు. ముగ్గురు మంత్రులు ఉండి కూడా ఈ జిల్లాకు ఉపయోగం లేదని వెంకటవీరయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు రామారావు, సత్తుపల్లి మున్సిపల్ మాజీ ఛైర్మన్ మహేష్, నాయకులు బి. లక్ష్మణ్‌రావు, అజయ్‌కుమార్, లక్కినేని రఘు, వీరమోహన్‌రెడ్డి, వెంకట్‌లాల్ తదితరులు పాల్గొన్నారు.

# రాజీవ్ యువ వికాసం పథకం గడువు పెంచాలి

**ప్రజాపక్షం/ఖమ్మం:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలని, ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రాజీవ్ యువ వికాసం పథకం దరఖాస్తు చేసుకోవడానికి గడువును పెంచాలని, సీపీఐ కూసుమంచి మండల కార్యదర్శి భూక్యా నరసింహ ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం కూసుమంచి మండల కేంద్రంలో జరిగిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రాజీవ్ యువ వికాసం పథకానికి పెద్ద మొత్తంలో దరఖాస్తులు రావడం వరుస సెలవులు రావడం తో సర్వర్ సమస్యలు తలెత్తాయి. దీంతో దరఖాస్తుదారులు ఆందోళన చెందుతున్నారని అన్నారు. ఈనెల 14 వరకు గడువు ప్రభుత్వం పెట్టడంతో నిరుద్యోగులు నష్టపోతున్నారని, మరల దరఖాస్తు గడువును పొడిగించి నిరుద్యోగులకు ప్రభుత్వం న్యాయం చేయాలని కోరారు. అదేవిధంగా దరఖాస్తులను ఆఫ్లైన్ పద్ధతిలో తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా సమితి సభ్యులు గుండెపంగు మల్లేష్, నాయకులు భూక్యా శ్రీకాంత్, పాండు రంగా చారి, శ్రీనివాస చారి తదితరులు పాల్గొన్నారు.